ప్రజాశక్తి

మంగళవారం 14 ఫిబ్రవరి 2023

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి



బోరు తీస్తుంటే వస్తున్న సున్నంరాయి పొడి...

జగనన్న కాలనీలకు...

సున్నపురాయి దెబ్బ!

గిడిజాలలో భూమిలోకి రిగ్గు దించినా నీరు తగలని వైనం

200 అడుగులు తవ్వినా... తెల్లటి సున్నపురాయే దర్శనం

పేదలకు ఇళ్ల పేర కొండలపైకి నెట్టేసే చర్యలపై సర్వత్రా ఆగ్రహం

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

'నవరత్నాలు- పేదలందరికీ ఇల్లు' నినాదంతో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న జగనన్న కాలనీల్లో సమస్యలు కోకొల్లలుగా కనిపిస్తున్నాయి. తాజాగా ఆనందపురం మండలం గిడిజాలలో సుమారు 4వేల మందికి పైగా ఇళ్లకు ప్లాన్ చేశారు. కొండపై కావడంతో ఇక్కడ బోరు తీయాలని వివిఎంఆర్‌డిఎ ఇంజినీర్లు సోమవారం 'జలం' కోసం రిగ్గును దించారు. చాలా చోట్ల 30 అడుగులకే నీరు వచ్చే పరిస్థితి ఉన్నా గిడిజాలలో మాత్రం 150 అడుగులకు పైగా రిగ్గు దింపినా తొలినుంచీ 'సున్నపురాయి' మాత్రమే తగలడంతో ఎటూ పాలుపోని స్థితిలో వుడా అధికారులు తలలు పట్టుకున్నారు. విశాఖనగరంలో గల పేదలను ఆనందపురం, పద్మనాభం మండలాల శివారు ప్రాంతాలు, లేదంటే కొండలపైకి తీసుకెళ్లి ఇళ్లను రాష్ట్ర ప్రభుత్వం కేటాయింపులు చేసింది. బోరు తీస్తేనే కాలనీలకు నీరు అవసరమైనంత లభిస్తుంది. ఎక్కడైనా 50 అడుగుల్లో జల్ కనిపిస్తే మరో 100 అడుగులు లోపలకి రిగ్గును దించి పెంచుతారు. ఇలా చేయడం వల్ల ఎలాంటి విపత్కరపరిస్థితుల్లోనైనా నీటికి కొరత ఉండదు. గిడిజాల జగనన్న హౌసింగ్ కాలనీ వద్ద మాత్రం కొండ ప్రాంతంలో వేల మందికి ఇల్లు కేటాయింపులు చేశారు. ఇక్కడ బోరు కోసం ఉదయం నుంచి సాయంత్రం వరకూ తవ్వకాలు చేపట్టినా సుద్దరాయి పొడి ఉప్పొంగి ఆ ప్రాంతమంతటా వ్యాప్తి చెందడం కనిపించింది. కానీ నీటిచుక్క మాత్రం రాలేదు. సాయంత్రం 4.30గంటల వరకూ ఈ ప్రక్రియ కొనసాగినా ఫలితం కనిపించలేదు. ఒకవేళ 200 అడుగుల వద్ద నీరు లభ్యమైతే మరో 100 అడుగులకు మరో రిగ్గను భూమిలోకి దింపాల్సి ఉంటుంది. అంత రిస్కును అధికారులు చేస్తారా? అన్నది ప్రశ్న.

హౌసింగ్ అధికారుల నిర్వాకం...

ఇళ్ల కేటాయింపులు, ప్రదేశాల ఎంపిక విషయంలో హౌసింగ్ సిబ్బంది తీరుపై స్థానికులు పెదవి విరుస్తున్నారు. పేదలకు ఇళ్ల పేర నగరానికి సుదూరంగా గ్రామీణ ప్రాంతాలకు విసిరేయడం ప్రభుత్వ విధానంగా ఉంది. నగరం చుట్టుపక్కలా కూలి పనులతో జీవనం గడుపుకునే వారిపట్ల ప్రభుత్వం ఒకరకమైన వివక్ష పాటిస్తూ కొండలపైకి, గ్రామాల శివార్లకు నెట్టేస్తుంది. ల్యాండ్ పూలింగ్ పేరుతో రెవెన్యూ అధికారులు పొలాలను లాక్కొన్నారంటూ రైతుల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఆనందపురం మండలంలో పలుచోట్ల నీరు సరిగ్గా

మిగతా 2లో..

పర్యాటకం అభివృద్ధికి ప్రతిపాదనలు

విశాఖ జిల్లా కలెక్టర్ మల్లికార్జున

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మల్లికార్జున

ప్రజాశక్తి-విశాఖపట్నం : జిల్లాలో పర్యాటక రంగం అభివృద్ధికి ఉన్న అవకాశాలను పరిశీలించి ప్రతిపాదనలు తయారుచేయాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున అధికారులను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టరు కార్యాలయ సమావేశ మందిరంలో జిల్లా టూరిజం కౌన్సిల్ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సంస్థలు జిల్లాలో పర్యాటక పరంగా దోహదపడే కార్యక్రమాలను కలెక్టర్‌కు వివరించారు. ఇందులో భాగంగా ఎలక్ట్రికల్ బైక్స్ యోయో రైడ్స్, విహంగ్ ఎడ్వెంచర్స్ వారి పారా మోటార్ ఫ్లైయింగ్, పారా సైలింగ్, నీటిపైన, రోడ్డు, ఇసుక, పర్వతాలపై రైడ్ చేయగల ఆల్టేరియన్ వెహికల్స్ వివరాలను సంబంధిత సంస్థల అధినేతలు వివరించారు. వీటిని పరిశీలించిన కలెక్టర్ వాటిని ఎక్కడ ఏర్పాటుచేయాలి, అవి ప్రజలకు, పర్యాటకులకు ఏవిధంగా ఎంటర్‌టైన్‌మెంట్ అందిస్తాయన్న అంశాలపై చర్చించారు. ఆయా సంస్థల ప్రాజెక్టులను పరిశీలించాలని టూరిజం రీజనల్ డైరెక్టర్‌ను ఆదేశించారు. జిల్లాలో రానున్న రోజులలో గ్లోబల్ ఇన్వెస్టర్స్ సమ్మిట్, జి-20 సమావేశాల సందర్భంగా దేశ విదేశాలతో పాటు పలు రాష్ట్రాల నుంచి పారిశ్రామికవేత్తలు, టూరిస్టులు అధిక సంఖ్యలో విశాఖకు వస్తారన్నారు. విశాఖ జిల్లాను సర్వాంగ సుందరంగా తీర్చి దిద్దడంతోపాటు, పర్యాటకులకు ఆహ్లాదకరమైన వాతావరణాన్ని కల్పించేలా టూరిజమ్‌ను అబివృద్ధి చేయాలన్నారు. ఈ సందర్భంగా జిల్లా జాయింట్ కలెక్టరు కె.ఎస్. విశ్వనాధన్, డిసిపి సుమిత్ సునీల్ గర్డ్ పలు సూచనలు చేశారు. ఈ సమావేశంలో ఆర్కియాలజి, అటవీ శాఖ, జివిఎంసి, పోలీస్ తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

డిమాండ్ల సాధనకు పెన్షనర్ల ధర్నా

వార్త 4లో..

నల్లరాయి క్వారీ లీజు రద్దు చేయాలని ధర్నా

వార్త 5లో..

ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంలో అలసత్వం : సిఐటియు

వార్త 8లో..

బడ్జెట్ గిఫ్ట్ కూపన్ వెనక్కి

ప్రజలకు పన్నుల భారాలు.. కార్పొరేటర్లకు నజరానాలా...

సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ గంగారావు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : జివిఎంసి 2023-24 బడ్జెట్ సమావేశం ఈ నెల 15న జరగబోతున్న సందర్భంగా రూ.15 వేల విలువ కలిగిన కూపన్‌ను గిఫ్ట్‌గా అందరు కార్పొరేటర్లతోపాటు 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావుకు కూడా పంపించారు. అయితే ఈ గిఫ్ట్‌ను గంగారావు తిరస్కరిస్తూ తిరిగి వారికే సోమవారం పంపించారు. ఈ సందర్భంగా ఆయన ఒక ప్రకటన చేస్తూ ఈ గిఫ్టులు సంస్కృతికి తానే కాకుండా, 78 వార్డు అయిన స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ ప్రజలందరూ కూడా తీవ్ర వ్యతిరేకమని తెలియజేశారు. గత బడ్జెట్ సందర్భంగా కూడా జివిఎంసి పెద్ద బ్రీఫ్ కేస్ పంపించారని, అప్పుడు కూడా దానిని తిరిగి పంపించిన విషయం గుర్తు చేశారు. గిఫ్ట్‌ల పేర ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేయడాన్ని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నట్లు పేర్కొన్నారు. గతంలో అధ్యయన యాత్ర పేర కార్పొరేటర్లను ఢిల్లీ, ఆగ్రా, సిమ్లా, చండీఘర్ వంటి నగరాలకు తీసుకెళ్లి రూ. కోట్లు వృథా చేశారని విమర్శించారు. ఆ అధ్యయన యాత్రను కూడా తాను బహిష్కరించిన విషయాన్ని గుర్తుచేశారు. విశాఖ నగరాన్ని పన్నుల నగరంగా మార్చి, కార్పొరేటర్లకు గిఫ్టులు పంపిణీ చేయడం ఏం న్యాయమని ప్రశ్నించారు.

ఆస్తి విలువ ఆధారంగా పన్ను విధించే పద్ధతి తీసుకొచ్చి ప్రజలపై వందల కోట్ల భారాలు వేశారని తెలిపారు. ఏటా 15 శాతం పెంచుతున్నారని పేర్కొన్నారు. మురుగు నీటి పన్ను విధించారని, చెత్తపై యూజర్ చార్జీలు వసూలు చేస్తున్నారని, బిల్డింగ్ ప్లాన్లు, ట్రేడ్ లైసెన్స్, ప్రొఫెషనల్ టాక్స్ ఇలా అనేక రూపాల్లో చార్జీలు పెంచారని వివరించారు. ఇలా ప్రజలపై భారాలు మోపి కార్పొరేటర్లకు గిఫ్టులు ఇవ్వటాన్ని ప్రజలెవ్వరూ హర్షించరని పేర్కొన్నారు. కనుక గిఫ్ట్‌ల సంస్కృతిని విడనాడాలని కోరారు. ప్రజల ధనాన్ని దుర్వినియోగం చేయొద్దని విజ్ఞప్తి చేశారు.

అలరించనున్న దిల్‌వాలా మూవీ

నట కిరీటి రాజేంద్రప్రసాద్

మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సినీ నటుడు రాజేంద్రప్రసాద్

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : దిల్‌వాలా మూవీ అన్ని తరగతుల ప్రేక్షకులను అలరిస్తుందని నటకిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్ అన్నారు. టర్నర్ చౌల్ట్రీలో ఈ మూవీకి సంబంధించి షూటింగ్ జరుగుతుంది. ఈ సందర్భంగా సోమవారం చిత్ర యూనిట్ మీడియాతో ముచ్చటించింది. ఈ మూవీలో ప్రధాన పాత్రను పోషిస్తున్న నట కిరీటి డాక్టర్ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, క్రైమ్ - కామెడీ మిళితమైన కథాంశంతో ఈ మూవీని రూపొందిస్తున్నట్లు చెప్పారు. చాలా ఏళ్ల తర్వాత ఒక మంచి సినిమాలో చేస్తున్న అనుభూతి కలుగుతుందన్నారు. తన పాత రోజులు గుర్తుకు వచ్చాయని చెప్పారు. 15 రోజులుగా ఈ మూవీ ఏకదాటిగా విశాఖలో షూటింగ్ జరుగుతుందని తెలిపారు. ఈ మూవీలో సరికొత్త రాజేంద్రప్రసాద్‌ను ప్రేక్షకులు చూస్తారని చెప్పారు.

డైరెక్టర్ వీరభద్రచౌదరి మాట్లాడుతూ ఈ మూవీ మొదటి షెడ్యూల్‌ను హైదరాబాదులో పూర్తిచేసినట్లు తెలిపారు. విశాఖలో రెండో షెడ్యూల్ ప్రారంభించామని చెప్పారు. సీనియర్ నటులు డాక్టర్ రాజేంద్రప్రసాద్‌తో కలిసి పనిచేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ ఈ చిత్రంలో మంచి క్యారెక్టర్ చేస్తున్నట్లు చెప్పారు. త్వరలోనే షూటింగ్ పూర్తిచేసి ప్రేక్షకుల ముందుకు తీసుకురానున్నట్లు వెల్లడించారు. ఈ సమావేశంలో నిర్మాత నరసింహ, ఎంపీ ఎంవివి సత్యనారాయణ, పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

జగనన్న కాలనీలకు సున్నపు రాయి దెబ్బ!

రావడం లేదన్న విమర్శలు వినిపిస్తున్నాయి. విశాఖనగరంలోని ఆరిలోవ, ఆదర్శనగర్, పిఎంపాలెం, మధురవాడ, కొమ్మాది ప్రాంతాల పేదలకు గిడిజాలలో సుమారు 5వేల ప్లాట్లను హౌసింగ్ అధికారులు జగనన్న కాలనీల కింద కేటాయించారు. గిడిజాల, పొడుగు పాలెం, రేగానిగూడెం, చిన్నయ్యపాలెం వరకూ శుద్ధరాయి పడుతోందని తెలుస్తోంది. కాలనీ లే-అవుట్లు నిర్మించిన తాగడానికి సురక్షిత నీరు లేకపోతే ప్రజలు నానా అవస్థలు పడాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు మేల్కొని సుద్దరాయి పడే ఆ ప్రాంతంపై ప్రత్యేక శ్రద్ధ వహించకపోతే పేదలకు ఇళ్లు ఇచ్చినా ఏ మాత్రం ఫలితం లేకుండా పోయే ప్రమాదం ఉంది.

స్టీల్‌ప్లాంట్ ప్రమాద బాధితులకు ఎంపీ పరామర్శ

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ : స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో గాయపడి చికిత్స పొందుతున్న స్టీల్‌ప్లాంట్ కార్మికులను విశాఖపట్నం ఎంపీ ఎంవీవీ సత్యనారాయణ పరామర్శించారు. వైద్యులతో మాట్లాడి క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని ఆదేశించారు మరియు క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడి ధైర్యం చెప్పారు. గాయపడిన వారిలో ఇద్దరి పరిస్థితి విషమంగానే ఉందని, వారికి ఇంటెన్సివ్ కేర్ యూనిట్‌లో చికిత్స అందిస్తున్నామని ఆసుపత్రి వర్గాలు తెలిపారు. మిగిలిన వారి ఆరోగ్యం రోజురోజుకూ మెరుగు పడుతుందని, వారికి ప్రాణాపాయం ఏమీ లేదని ప్రకటించారు.

జివిఎంసి "స్పందన"కు 57 వినతులు

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం స్పందన కార్యక్రమం నిర్వహించారు. జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఆదేశాల మేరకు అదనపు కమిషనర్ ఎస్-ఎస్ వర్మ ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. 'స్పందన'కు 57 వినతులు వచ్చినట్లు ఎస్ఎస్.వర్మ తెలిపారు. రెండవ జోనుకు సంబంధించి 7, మూడు, నాలుగు జోన్ల నుంచి నాలుగేసి చొప్పున, 5వ జోనుకు సంబంధించి 20, 6వ జోను నుంచి 9, ఏడవ జోను-1, ఎనిమిదవ జోను నుంచి 3, ప్రధాన కార్యాలయానికి సంబంధించి 9 ఫిర్యాదులు వచ్చాయని చెప్పారు. వీటిలో పరిపాలన, అకౌంట్స్ విభాగానికి సంబంధించి 4, రెవెన్యూకు 8, ప్రజారోగ్యానికి 5, టౌన్ ప్లానింగ్- 19, ఇంజినీరింగ్ - 5, యుసిడికి సంబంధించి 16 ఫిర్యాదులు వచ్చాయని వివరించారు. ఈ ఫిర్యాదులను పరిశీలించి మూడు రోజులలో పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను కమిషనర్ ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కమిషనర్ డాక్టర్ వి.సన్యాసిరావు, ఎగ్జామినర్ ఆఫ్ అకౌంట్స్ వాసుదేవరెడ్డి, సెక్రటరీ పి.నల్లనయ్య, ఫణిరాం, నిరంజన్‌రెడ్డి, మల్లికాంబ, డిపిఒ చంద్రిక, పిఒ(యుసిడి) సూర్యకళ పాల్గొన్నారు.

ఎస్‌సి కార్పొరేషన్ పథకాల పునరుద్ధరణకు దీక్ష

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రాష్ట్రంలోని వైసిపి ప్రభుత్వం ఎస్‌సి కార్పొరేషన్‌లో రద్దుచేసిన 26 పథకాలను వెంటనే పునరుద్ధరించాలని డిమాండ్ చేస్తూ బిజెపి ఎస్‌సి మోర్చా జిల్లా కమిటీ ఆధ్వర్యాన సోమవారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద 24 గంటల దీక్ష చేపట్టారు.

ఆర్థిక అక్షరాస్యతపై అవగాహన అవసరం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ఆర్థిక అక్షరాస్యతపై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున పేర్కొన్నారు. రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా చేపడుతున్న ఆర్థిక అక్షరాస్యత వారం - 2023కు సంబంధించిన పోస్టర్లను జిల్లా కలెక్టర్, ఎల్‌డిఎం వివిఎస్.శర్మతో కలిసి కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో సోమవారం ఆవిష్కరించారు. మన రక్షణకు మంచి ఆర్థిక ప్రవర్తన అనే నినాదంతో వారం రోజుల పాటు అవగాహన కార్యక్రమాలు జరుగుతాయని వివిఎస్.శర్మ వివరించారు. ఆర్థిక అక్షరాస్యత వారంలో భాగంగా జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో సిఎఫ్ఎల్, ఎఫ్ఎల్‌సి, బ్యాంకుల ద్వారా సమావేశాలు నిర్వహిస్తామన్నారు. బ్యాంకు వినియోగదారులను అప్రమత్తం చేయడానికి రిజర్వ్ బ్యాంకు ఆఫ్ ఇండియా పలు సూచనలు చేసిందని, వాటికి సంబంధించి ప్రజల్లో అవగాహన పెంచడానికి పోస్టర్లను ముద్రించినట్లు తెలిపారు. ఒటిపి, పాస్‌వర్డ్, పిన్, బ్యాంకు ఖాతా వివరాలను ఎవ్వరితోనూ పంచుకోకూడదని పోస్టర్ల ద్వారా చైతన్యం చేస్తున్నట్లు చెప్పారు.

కెజిహెచ్‌లో మెరుగైన సౌకర్యాలు

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : ప్రతి రోజూ వైద్యం కోసం కెజిహెచ్‌కు వచ్చే రోగులతో పాటు వారి సహాయకులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎ.మల్లికార్జున కెజిహెచ్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టర్ కెజిహెచ్‌ను ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రోగులతో పాటు, వారి సహాయకులు విశ్రాంతి తీసుకునేందుకు ఏర్పాటుచేసిన 200 పడకల ఉచిత వసతి భవనాన్ని పరిశీలించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ, ఎమర్జెన్సీ వార్డుకు వచ్చే రోగుల సహాయకులు విశ్రాంతి తీసుకొనేందుకు వెయిటింగ్ హాలు ఏర్పాటుచేయాలని సూచించారు. కెజిహెచ్ పరిపాలన భవనం ఎదురుగా ఉన్న స్థలంలో పార్కును అభివృద్ధి చేయాలన్నారు. అవసరమైన చోట వాటర్ ఫౌంటెన్, కూర్చునేందుకు బల్లలు ఏర్పాటు చేసి నవీకరించాలని సూచించారు. కెజిహెచ్ ప్రవేశ ద్వారానికి ఆర్చ్ ఏర్పాటు చేయాలని, పార్కింగ్ స్థలాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కెజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ పి.అశోక్‌కుమార్, ఎపిఎంఐడిసి ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ నాయుడు, పలువురు వైద్యులు, అధికారులు పాల్గొన్నారు.

టెన్నిస్‌లో విశాఖ యువత ప్రతిభ

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : గుంటూరు జిల్లా నరసరావుపేటలో జరిగిన 66వ రాష్ట్ర పాఠశాల అండర్ 17 టెన్నిస్ పోటీల్లో విశాఖ యువత ప్రతిభ కనబరిచారు. ఈ పోటీల్లో వివిధ జిల్లాలకు చెందిన బాలురు, బాలికల టీమ్‌లు తలపడ్డాయి. మొదటి నాలుగు స్థానాలలో విశాఖ నగరానికే చెందిన నిషిత్ ఆరిమిల్లి, కిరణ్ కుమార్, శివాజీ పిల్ల, నిశాంత్ దేవరపల్లి నిలిచారు. 17 ఏళ్ల లోపు బాలికల పోటీలో మొదటి ఐదు స్థానాలలో హర్షిని విశ్వంద్, మోక్ష ధనంజయ, భావన, హిమజారెడ్డి, నగరాని చరిష్మా నిలిచారు. అండర్ 17 బాలికల జట్టు కెప్టెన్‌గా హర్షిని విశ్వనాథ్, వైస్ కెప్టెన్‌గా మోక్ష ధనుంజయ వ్యవహరించారు. అండర్ 17 బాలుర జట్టు కెప్టెన్‌గా నిషిత్ ఆరిమిల్లి, వైస్ కెప్టెన్‌గా కిరణ్ కుమార్ వ్యవహరించి జట్టును ముందుకు నడిపించారు. వీరికి సర్టిఫికెట్లు అందజేసి క్రీడాకారులను అభినందించారు.

సర్టిఫికెట్లతో క్రీడాకారులు

ఆంధ్రప్రదేశ్‌కు అన్యాయం

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : ఆంధ్రప్రదేశ్‌కు వైసిపి అన్యాయం చేస్తోందని బిజెపి జాతీయ కార్యదర్శి సునీల్ దియోధర్ ఆరోపించారు. సోమవారం సాయంత్రం మేఘాలయ హోటల్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ, రాష్ట్రంలో టిడిపి, వైసిపి విఫలమైన పార్టీలన్నారు. ఈ రెండూ కుటుంబ, కులతత్వ, అవినీతి పార్టీలని ఆరోపించారు.

జివిఎంసి ప్రత్యేక బడ్జెట్ సమావేశం వాయిదా

ప్రజాశక్తి-ఎంవిపి.కాలనీ : విశాఖపట్నం నగరపాలక సంస్థలో ఈ నెల 15 తేదీన జరగాల్సిన ప్రత్యేక సర్వసభ్య బడ్జెట్ సమావేశం శాసనమండలి ఎన్నికల ప్రవర్తనా నియమావళి కారణంగా వాయిదా వేసినట్లు జివిఎంసి కమిషనర్ పి.రాజాబాబు ఒక ప్రకటనలో తెలిపారు. ఉత్తరాంధ్ర పట్టభద్రుల నియోజకవర్గం శాసనమండలి సభ్యుల ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులో ఉన్నందున ఈ నెల 15వ తేదీన జరగాల్సిన బడ్జెట్ సమావేశం వాయిదా వేశామని, ఎన్నికల నియమావళి ముగిసిన పిదప తదుపరి సమావేశం తేదీ సమయం తెలియజేస్తామని పేర్కొన్నారు.

పోలీస్ స్పందనకు 42 ఫిర్యాదులు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో నగర పోలీస్ కమిషనర్ సిహెచ్. శ్రీకాంత్ నిర్వహించిన స్పందనకు 42 వినతులు వచ్చాయి. ఈ స్పందన కార్యక్రమంలో నగర పోలీస్ కమిషనర్‌తోపాటు డిసిపి (క్రైమ్స్) జి.నాగన్న, డిసిపి-1 సుమిత్ సునీల్ గరుడ్ వినతులు స్వీకరించారు. కమిషనర్ శ్రీకాంత్ పలు సమస్యలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించాలని ఆదేశించారు.

ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : సాగర తీర కళంజియ సమాఖ్య ఆధ్వర్యాన మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ సహకారంతో సోమవారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. పెద్ద జాలారిపేట రామాలయం దగ్గర కల్యాణ మండపంలో 130 మంది మహిళలకు దీర్ఘకాలిక వైద్య పరీక్షలు నిర్వహించారు. శిబిరంలో రొమ్ము కేన్సర్, గర్భాశయ కేన్సర్, స్క్రీనింగ్ పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో సాగర తీర కళంజియ సమాఖ్య కో-ఆర్డినేటర్ ఎన్.ధనలక్ష్మి, ధాన్ ఫౌండేషన్ హెల్త్ కో-ఆర్డినేటర్ కె.మురళీకృష్ణ, హెల్త్ అసోసియేట్ డి.దేవి, మహాత్మా గాంధీ కేన్సర్ హాస్పిటల్ ఏరియా మేనేజర్ దినేష్, గైనకాలజిస్ట్ డాక్టర్ సుభద్ర, డాక్టర్ బంతినా, ఏరియా లీడర్స్ మసెనమ్మ, నారాయణమ్మ, గోవిందలక్ష్మి, సత్య, విమల కుమారి, సమాఖ్య సిబ్బంది దేవుడమ్మ, అపర్ణ, లక్ష్మి, అరుణ పాల్గొన్నారు.

కెజిహెచ్‌లో డైట్ సరఫరాకు టెండర్లు

ప్రజాశక్తి-విశాఖపట్నం : కెజిహెచ్‌లో రోగులకు, డాక్టర్లకు డైట్ సరఫరాకు వేసిన టెండర్లను జాయింట్ కలెక్టర్ కెఎస్ విశ్వనాథన్ సమక్షంలో బిడ్లర్ల ముందు తెరిచారు. డిడిఎమ్‌సి ఛైర్మన్‌గా జాయింట్ కలెక్టర్, కన్వీనర్‌గా సూపరింటెండెంట్, చిన్న పిల్లల వైద్యులు, జనరల్ ఫిజీషియన్, డిఎమ్ అండ్ హెచ్ఓ డైటీషియన్ సభ్యులుగా ఉన్న కమిటీ ఆధ్వర్యంలో ఈ నిర్వహణ జరిగింది. 11 మంది డైట్ అప్లికేషన్లను తీసుకొనగా 9 మంది పాల్గొన్నారు. అన్ని అంశాలను పరిశీలించిన తరువాత బిడ్డర్లను ఎంపిక చేయనున్నట్లు సూపరింటెండెంట్ డాక్టర్ అశోక్ కుమార్ తెలిపారు.

IN THE HONOURABLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE AT TEKKALI.
I.P. 01/2022

Between: **Mandapaka Nirmala Kumari** ...Petitioner.
And: 1) **Yerrupalli Rajesh and 40 others** ...Respondents.

To
R13: Chandhan Shilpa, W/o Anil, Door No:30-95-30,Vadlapudi Street, Kurman napalem, Vadlapudi, Visakhapatnam Town and District.
R28: Tumpada Vinod Kumamr, M/o Rajeswari, Ashyaa Castle, Dwarakanagar, Rama Talkies Down,Visakhapatnam Town and District.

NOTICE

Take notice that the insolvency petition filed by the above named petitioner is posted for hearing at 10.30 a.m., on 23-02-2023 before the Honourable Senior Civil Judge Court, Tekkali, and if you was-n't to contest the matter you may do so either in person or by a duly instructed pleader and if you fail to show cause matter will be decided in your absence and expert. // By court order //

Chigurupalli Rama Mohan,
Advocate, Srikakulam
Cell: 9440116221, 8341023288

IN THE HON'BLE COURT OF THE PRINCIPAL SENIOR CIVIL JUDGE, AT: VISAKHAPATNAM
E.P. 36/2021 in O.S. 899/2016

Between :
Pandiri Divya ...Decree Holder
And
Pampana Rambabu ...Judgment Debtor

వేలం ప్రకటన

పై నెంబరు అమలు పిటీషన్‌లో డిక్రీ బాకీ మరియు వడ్డీ, ఖర్చులు రాబట్టు నిమిత్తం పై జడ్జిమెంట్ డెటారు యొక్క ఈ క్రింది షెడ్యూలు ఆస్తిని తేది. **02-03-2023**న ఉ॥గం॥**10.30** ని॥ల నుండి సా॥గం॥**5.00** మధ్య సమయంలో వేలంవేయుటకు పై శ్రీ కోర్టు వారు ఉత్తర్వులు జారీచేసియున్నారు. కావున వేలంపాటలో పాల్గొనదలచిన ఆసక్తిగలవారు పై తేదిన శ్రీ కోర్టువారి ఎదుట ఉ॥గం॥10.30ని॥ లకు హాజరుకావలెనని ఇందుమూలంగా యావన్మందికి తెలియజేయడమైనది.

SCHEDULE OF PROPERTY

Ground floor R.C.C. house bearing D.No.19-9-5, consisting around 300 Sft and first floor consisting around 180 Sft in extent of 34 Sq.yds or 28.43 Sq.mts of T.S.No.653 Asst No.10000050091 Mandavari Veedhi Maharanipeta Ward, Visakhapatnam and bounded as follows: **East:** Wall of K.G.H, **South:** Bammi Kesava Rao and Satyavathi Part sold by defendant, **West:** Muncipal Lane, **North:** House of Gidituri Annapurna.

DHR Value : Rs. 8,00,000/-
Amin Value : Rs.18,50,000/-
J.Dr Value : Not furnished

M.K.S. ASSOCIATES
M.S. VENKATESH, M.K. SRINIVAS & M. KAUSHIK, Advocates
Visakhapatnam. **Cell: 9866668494.**

IN THE HON'BLE COURT OF THE IV ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
M.O.P. 717/2021

Between :
G. Kishore Chand ...Petitioner
And:
Sri U. Rama Chandra Murthy & 2 others ...Respondents

NOTICE

To,
R-1:Sri U. Rama Chandra Murthy S/o. Rama Krishna Rao, R/at D.No. 65-4-308/1, Nakkavanipalem, Visakhapatnam.

Please take notice that the above named petitioner herein has filed the above M.O.P. against you and other respondents claiming compensation and the matter stands posted to **21-02-2023** for your appearance. You are hereby required to appear before the Hon'ble Court either in person or through duly instructed Advocate on **21-02-2023** at **10:30 A.M.** in the above Court to answer all material questions, failing which the matter will be heard and determined in your absence, exparte as per law.

CH. ANAND KUMAR,
Advocate,
Visakhapatnam,
Cell: 9393293935.

IN THE HON'BLE COURT OF THE VII ADDL. DISTRICT JUDGE AT: VISAKHAPATNAM
I.A.574/2022 in A.S.102/2022

Between:
Sri Pydipalli Veerabhadra Rao ...Appellant
And:
Sri Nallamailli Venkata Reddy & 4 others ...Respondents

NOTICE

To,
R-2: Smt. K. Lakshmi Bai, W/o.Late K. Venkata Ramanayya, Hindu, aged 83 years, R/at. D.No.51-8-40/21/1, Besides Rythu Bazaar, Seethammadhara, Visakhapatnam.
R-5: Sri K. Gangadhar, S/o.Late Krishna Murthy, Hindu, aged 43 years, R/at. D.No.3-9, Pedda Veedhi, Vajrapu Kothuru, Battupadu, Garuda Khandi, Srikakulam District.

Take Notice that Appellant Sri Pydipalli Veerabhadra Rao, S/o. Late P. Suryanarayana Murthy, R/at D.No. 9-17-29/2/2, CBM Compound, Visakhapatnam has preferred the above Appeal and Application before the Hon'ble Court over the decree and judgment passed in O.S.1171/2014 of the file of I Addl. Senior Civil Judge Court at Visakhapatnam and it is stands posted to **20-02-2023** for your appearance before the Hon'ble Court by **10:30 A.M** either in person or through Advocate, failing which the Hon'ble Court will be decide the matter at your absence.

S. NAGESH KUMAR, Advocate
Dondaparthi, Visakhapatnam.
Cell : 9848282374, 8106523333.

IN THE HON,BLE COURT OF THE X ADDL. DISTRICT JUDGE AT: ANAKAPALLE
O.S. 61/2016

Between:
Smt. Dandu Anitha, Rep. by GPA Sri Guddati Srinivasa Subrahmanya Ravi Kumar ...Plaintiff
And:
1. Sri Koviri Appanna
2. Smt. Koviri Pentamma (died)
3. Sri Koviri Nookaraju
4. Sri Koviri Masenu ...Defendants

SUMMONS

To,
Defendant No.4:
Sri Koviri Masenu,
S/o. Appanna, R/at Chilakapeta, Backside of Lakshmi Talkies, 1-Town, Visakhapatnam.

Take notice that the above named plaintiff has filed suit against defendants 1 & 2 for declaration that the plaintiff is the absolute owner of the plaint schedule "B" property and for recovery of possession of the plaint schedule "B" property from the defendants 1 & 2. Defendant No.2 died, petition filed for adding of legal heirs was allowed, the defendants 3 & 4 were added in the suit. Therefore you are hereby summoned to appear in the above named court and in the above numbered case on **02-03-2023** at **10:30 A.M** before the Hon'ble Court, either in person or through a pleader duly instructed and participate in the case proceedings, as other in your absence the matter will proceed with further.

(By Order of the Hon'ble Court)
B.TRINADHA RAO,
E.SRINIVASA RAO,
& R. RAMA RAO
Advocates, Visakhapatnam-20

'స్పందన'కు 10 అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : ఒకటో జోనల్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో 10 అర్జీలు అందాయి.జెడ్‌సి బొడ్డేపల్లి రాము ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఇంజినీరింగ్ విభాగానికి చెందిన తొమ్మిది వినతులురాగా,ఉద్యానవన విభాగానికి చెందిన ఒక అర్జీ వచ్చింది. స్పందనలో ఎఇ ఎ సుమన్, టిపిఒ ర్యూని, శానిటరీ ఇన్‌స్పెక్టర్ బి మహాలక్ష్మి నాయుడు పాల్గొన్నారు.

తాగునీటి ఎద్దడి నివారణకు 'క్రాష్'

ప్రజాశక్తి -భీమునిపట్నం : వేసవిలో గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి ఎద్దడి నివారణకు 45 రోజుల క్రాష్ ప్రోగ్రాంను స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద సోమవారం ఎంపిడిఒ పి.వెంకటరమణ లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, క్షేత్ర స్థాయిలో పూర్తి పరిశీలన తర్వాత ప్రాధాన్యతా క్రమంలో పంచాయతీల వారీగా తాగునీటి బోర్లను బాగుచేసి వినియోగంలోకి తెస్తామన్నారు. ఆర్‌డబ్ల్యుఎస్ డిఇఇ ఎం.దుర్గాంబ, ఎఇ పి.సుబ్బలక్ష్మి, మెకానిక్‌లు పాల్గొన్నారు.

ఎన్నికల ప్రచారంపై దిశానిర్దేశం

ప్రజాశక్తి- సీతమ్మధార : త్వరలో జరగనున్న ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో పోలింగ్ బూత్‌ల ఇన్‌ఛార్జిల నియామకం, ప్రజలతో మమేకమై ప్రచార కార్యక్రమం నిర్వహించడంపై ఉత్తర నియోజకవర్గ వైసిపి కార్యాలయంలో పార్టీ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె రాజు సూచనల మేరకు ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ప్రచార నిర్వహణపై దిశానిర్దేశం చేశారు. డిప్యూటీ మేయర్ కట్టుమూరి సతీష్, ఫ్లోర్ లీడర్ బాణాల శ్రీనివాసరావు, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ కంపా హనోక్, స్టాండింగ్ కమిటీ సభ్యులు సారిపల్లి గోవింద్, బర్కత్ అలీ, కార్పొరేటర్స్ అనిల్‌కుమార్ రాజు, సాడి పద్మ రెడ్డి, అక్కి లీలావతి శ్రీనివాస్, కంటిపాము కామేశ్వరి, వావిలపల్లి ప్రసాద్, రెయ్యి వెంకటరమణ, చల్లా రజిని ఈశ్వరరావు, శశికళ, వార్డు అధ్యక్షులు నీలి రవి, రత్నాకర్ పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవాలు

ప్రజాశక్తి - ఆరిలోవ : చినగదిలి నార్త్ షిరిడి సాయిబాబా ఆలయ వార్షికోత్సవం సోమవారంతో వైభవంగా ముగిసింది. ఆరిలోవ శ్రీకాంత్‌నగర్ ఎస్‌వివి. హోటల్ యజమాని పప్పల సత్యనారాయణ సహకారంతో 500 మంది భక్తులకు అన్నదానం చేసారు. ఆలయ కమిటీ చైర్మన్ వానపల్లి అప్పారావు, కమిటీ సభ్యులు తెలిపారు.

క్రియాశీల సభ్యత్వ నమోదు

ప్రజాశక్తి -మధురవాడ :ఎండాడ, రుషికొండ ప్రాంతాల్లో జనసేన క్రియాశీల సభ్యత నమోదును ఎనిమిదో వార్డు నాయకుడు శాఖరి శ్రీనుబాబు ప్రారంభించారు. జనసేన సభ్యత్వమున్న వారికి రూ.50వేలు బీమా, రూ.ఐదు లక్షల పరిహారాన్ని పార్టీ అందిస్తుందన్నారు. జన సైనికులు, వీర మహిళలు విధిగా క్రియాశీల సభ్యత్వాన్ని పొందాలన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన

ప్రజాశక్తి -మధురవాడ : ఎనిమిదో వార్డు రుషికొండ బీచ్‌లోని టూరిజం స్పాట్‌లో ప్లాస్టిక్ నిషేధంపై జెడ్‌సి కనకమహాలక్ష్మి ఆధ్వర్యంలో సోమవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు, బీచ్ శుభ్రతకు స్థానికులతోపాటు సందర్శకులు సహకరించాలని, ప్రభుత్వ ఆదేశాల మేరకు సింగిల్ యూజ్ ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానేయాలని అవగాహన కల్పించారు. ఎంఎంహెచ్ఒ డాక్టర్ కిషోర్‌కుమార్, ఎస్ఎస్ శ్రీనివాస్‌రాజు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ రవి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ పోటీల్లో మణికంఠ ప్రతిభ

కప్‌తో మణికంఠ

ప్రజాశక్తి- సీతమ్మధార : జైపూర్‌లో జరిగిన ఫిట్ ఇండియా ఫుట్‌బాల్ ఎనిమిదవ నేషనల్ పైకా గేమ్స్‌లో ఆంధ్ర జట్టు విజయం సాధించినట్లు కోచ్ మధుసూదనరావు, శ్రీనివాస్ తెలిపారు. ఆంధ్రా జట్టు విజయంలో విశాఖ జిల్లా రామకృష్ణనగర్ చెందిన పాండవ మణికంఠ కీలక పాత్ర పోషించాడని తెలిపారు. నారాయణ విద్యాసంస్థల్లో తొమ్మిదో తరగతి చదువుతున్న పైకా నేషనల్ ఫుట్‌బాల్ గేమ్స్‌లో చూపిన ప్రతిభపై కోచ్‌లతోపాటు పలువురు అభినందించారు.

మూతబడిన పాఠశాల భవనం కూల్చివేత

- బాధ్యునిపై చర్యలకు పోలీసులకు ఫిర్యాదు
- ఘటనా స్థలాన్ని పరిశీలించిన కార్పొరేటర్, అధికారులు

కూల్చిన పాఠశాల భవనాన్ని పరిశీలిస్తున్న కార్పొరేటర్, అధికార్లు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి నాల్గో వార్డు కాపులుప్పాడ, పాత వరదేశిపాలెంలో మూతబడిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనం కూల్చివేతపై ఎంపిడిఒ వెంకటరమణ పోలీసులకు ఫిర్యాదు చేశారు.అదే గ్రామానికి చెందిన ఓ రియల్టర్ ఆదివారం అర్ధరాత్రి సమయంలో వీధి దీపాలు ఆర్పేసి, తన జెసిబి సాయంతో భవనాన్ని కూల్చివేశారు. సమాచారం తెలుసుకున్న వార్డు కార్పొరేటర్ దౌలపల్లి కొండబాబు, తహశీల్దార్ కోరాడ వేణుగోపాల్, సిఐ కె లక్ష్మణమూర్తి, ఎంపిడిఒ పి వెంకటరమణ, ఎఇఇ కె.వి.బాలామణి, విఆర్ఒ జి అప్పారావు సోమవారం ఆయా ప్రాంతాన్ని పరిశీలించారు.

బాధ్యులపై చర్యలకు పోలీసులకు ఫిర్యాదు

శిథిలావస్థకు చేరిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల భవనాన్ని రాత్రి వేళ విద్యుత్ సరఫరా నిలిపేసి, చీకట్లో జెసిబి సాయంతో గుట్టుగా కూల్చేసిన ఘటనకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒ వెంకటరమణ స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.

శిథిలావస్థకు చేరిందని...

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన ఈ పాఠశాల భవనాన్ని 1989 ఆగస్టు 26న అప్పటి జెడ్‌పి చైర్మన్ బాకూరి చిన అప్పలరాజు, నాటి ఎమ్మెల్యే ఆర్‌ఎస్‌డిపి అప్పల నరసింహారాజుతో కలిసి ప్రారంభించారు. 15 ఏళ్ల క్రితమే ఇది శిథిలావస్థకు చేరుకోవడంతో సమీపాన కొత్త భవనాన్ని నిర్మించి, పాఠశాలను అక్కడికి మార్పు చేయడంతో పాత భవన నిరుపయోగమై శిథిలావస్థకు చేరుకుంది. 44మంది విద్యార్థులున్న ఈ పాఠశాల కొత్త భవనానికి నాడునేడు నిధులతో అభివృద్ధి చేస్తున్నా, పాత భవనాన్ని పట్టించుకోక శిథిలావస్థకు చేరుకుంది.

అన్యాక్రాంతమైన పాఠశాల స్థలం

పాఠశాల భవన నిర్మాణానికి అదే గ్రామానికి చెందిన ఒకవ్యక్తి అప్పట్లో ఎనిమిది సెంట్లు స్థలాన్ని దానం చేశారని,ఈ స్థలం అన్యాక్రాంతం కావడంతో ఇపుడు మూడు సెంట్లు మాత్రమే మిగిలిందని స్థానికులు అంటున్నారు. ప్రజాప్రయోజనానికి సొంతస్థలాలను అధికారికంగా ప్రభుత్వానికి సంస్థలుగానీ, వ్యక్తులుగానీ ఎవరు దానం చేసినా దాన్ని తిరిగి స్వాధీనం చేసుకునే హక్కు, అధికారం వారికి ఉండబోదని ఎంపిడిఒ వెంకటరమణ, ఎఇఇ బాలామణి తెలిపారు.

వాంబేకాలనీ సమస్యల పరిష్కారానికి ధర్నా

జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న టిడిపి నేతలు

ప్రజాశక్తి -గాజువాక : 65వ వార్డు వాంబే కాలనీలోని పెండింగ్ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ టిడిపి ఆధ్వర్యంలో గాజువాక జోనల్ కార్యాలయం ఎదుట సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా నియోజకవర్గ టిడిపి సమన్వయకర్త ప్రసాదుల శ్రీనివాస్ మాట్లాడుతూ, జివిఎంసి ఎన్నికలకు ముందు కాలనీని దత్తత తీసుకుని అభివృద్ధి చేస్తానని నమ్మబలికి, అధికారంలోకి వచ్చిన వైసిపి కార్పొరేటర్ కేబుల్ మూర్తి, రెండేళ్ల గడుస్తున్నా వీసమంతైనా అభివృద్ధి చేపట్టలేదని ఆరోపించారు. డ్రైనేజీలు, రోడ్లతోపాటు చివరకు వీధిదీపాలు లేక వార్డు ప్రజలు అవస్థలు పడుతున్నా తమకేమీ పట్టనట్టు వ్యవహరించారని మండిపడ్డారు. తక్షణమే కాలనీ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జెడ్‌సి సింహాచలానికి వినతిపత్రం అందజేశారు.

విశ్వనాథ్, వాణీ జయరామ్‌లకు ఘననివాళి

ప్రజాశక్తి -గోపాలపట్నం : కళాతపస్వి కె విశ్వనాథ్, మధుర గాయని వాణీ జయరాం మరణం తెలుగు చలనచిత్ర రంగానికి తీరని లోటని రాష్ట్ర యువశక్తి అవార్డు గ్రహీత నందవరపు సోములు అన్నారు. గోపాలపట్నంలో గోపాలపట్నం కళాపీఠం ఆధ్వర్యంలో నిర్వహించిన సంస్మరణ సభలో విశ్వనాథ్, వాణీ జయరాం చిత్రపటాలకు పూలమాలవేసి ఘన నివాళ లర్పించారు ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు సంస్కృతికి సాంప్రదాయాలను ప్రతిబింబించే ఎన్నో చిత్రాలకు విశ్వనాథ్ దర్శకత్వం వహిస్తే, వాటిలోని పాటలకు తన గాత్రదానంతో వాణీజయరాం జీవం పోసి అనేక అవార్డులు, రివార్డులతోపాటు ప్రజాభిమానాన్ని చూరగొన్నారని కొనియాడారు. కార్యక్రమంలో కళాపీఠం అధ్యక్షులు గొరకాల రామదాసు, సభ్యులు కంప అప్పారావు, కె.నూకరాజేశ్వరరావు, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

నివాళులర్పిస్తున్న కళాపీఠం సభ్యులు

ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలి

సదస్సులో మాట్లాడుతున్న డైట్ అధ్యాపకులు మాధవి

ప్రజాశక్తి -తగరపువలస : పదో తరగతి విద్యార్థులు ఆత్మ విశ్వాసాన్ని పెంపొందించుకోవాలని స్థానిక ప్రభుత్వ డైట్ అధ్యాపకులు జె మాధవి సూచించారు.సోమవారం చిట్టి వలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఎపిఎస్ఇఆర్, ఎస్‌సిఇఆర్‌టి సంయుక్తంగా నిర్వహించిన 'సెలబ్రేషన్ ఆఫ్ ఎగ్జామినేషన్స్ ఓరియంటేషన్, సెన్సిటైజేషన్ ప్రోగ్రాం ఫర్ స్కూల్ చిల్డ్రన్' అంశంపై అవగాహన కల్పించారు.శారీరక వ్యాయామం, పోషకాహారం ఆవశ్యకతను వివరించారు. పరీక్షల ఒత్తిడిని ఎలా అధిగమించవచ్చునో పాఠశాల హెచ్ఎం పొ ట్నూరు మురళీ మోహనరావు సూచించారు.కార్యక్రమంలో డైట్ అధ్యాపకులు ఎస్‌కె అల్లాఉద్దీన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం

ప్రజాశక్తి -గోపాలపట్నం : బుచ్చిరాజుపాలెం రైల్వే క్యాబిన్ సమీపంలో రైలు కింద పడి వ్యక్తి దుర్మరణం పాలైన ఘటన ఆదివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. ఎయిర్‌పోర్టు పోలీసుల సమాచారం మేరకు రైలు దిగుతూ ప్రమాదవశాత్తు పడి మృతి చెందాడని భావిస్తున్నారు. మృతుని వద్ద నున్న ఆధార్ కార్డు ఆధారంగా శ్రీకాకుళం జిల్లా పలాస ప్రాంతానికి చెందిన శృంగవరపు కోటేశ్వరరావుగా ఉంది.. రైల్వే పోలీసులకు సమాచారం చేరవేసి, మృతదేహాన్ని అప్పగించారు

కుష్టు వ్యాధిపై అవగాహన

ప్రజాశక్తి- పద్మనాభం : కుష్టువ్యాధిగ్రస్తుల పట్ల వివక్ష తగదని లెప్రసీ, ఎయిడ్స్ నివారణ జిల్లా అధికారి డాక్టర్ పూర్ణేంద్రబాబు అన్నారు. సోమవారం రేవిడి పిహెచ్‌సి ఆధ్వర్యంలోఆసుపత్రి ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో కుష్టువ్యాధి లక్షణాలు, వ్యాధి నిర్ధారణ, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో పిహెచ్‌సి వైద్యాధికారి డాక్టర్ స్వప్న మాట్లాడుతూ, వ్యాధి లక్షణాలపై ప్రజల్లో అవగాహన కల్పించడం తోపాటు ఇంటింటికి వెళ్లి వ్యాధిగ్రస్తులను గుర్తించాలని సూచించారు. వ్యాధినిర్ధారణజరిగితే ప్రభుత్వపరంగా ఉచితంగా అందించే ఎండిటి థెరపీతో వ్యాధి నియంత్రించవచ్చన్నారు.

అంగవికలురకు రగ్గులు, ఎంసిఆర్ చెప్పులు పంపిణీ

విశాఖపట్నం మానవత సేవా ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 50 మంది వికలాంగులకు అవసరమైన ఎంసిఆర్ చెప్పులు, కిట్లుతోపాటు రగ్గులను పంపిణీ చేశారు.రేవిడి ఉన్నతపాఠశాల విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. సిహెచ్ఒ శాంతికుమారి డిపిఎం భీమేశ్వరరావు. ఎంపిహెచ్ఇఒ శ్రీనివాసరావు, రాము, హెచ్‌ఎస్‌లు సతీష్, ఆదినారాయణ పాల్గొన్నారు.

రెవెన్యూ రికార్డుల్లో పేరు మార్పుపై ఫిర్యాదు

ప్రజాశక్తి-పద్మనాభం : యాభై ఏళ్లకు పైగా తమ సాగుబడిలో ఉన్న పదెకరాల భూమిని వేరే వ్యక్తి తన పేరున రెవెన్యూ అధికారుల అండతో రికార్డుల్లో మార్పు చేయించుకున్నారని మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన అలబాన అప్పన్న, శిర దేవుడు, కోరాడ నరసింహరాజు అనే రైతులు కలెక్టరేట్ స్పందనలో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. సర్వే నెంబర్ 349 లో 9.40 ఎకరాల భూమిలో మామిడితోటలు పెంచి, ఫలసాయంతో కుటుంబపోషణ చేస్తున్నామని, అయితే రెవెన్యూ అధికారుల సహకారంతో చింతపల్లి అప్పలరాజు ఆ భూమిని తనపేరున మార్చుకున్నారని ఫిర్యాదు చేశారు. దీనిపై పరిశీలన జరిపి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.

టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - ఆరిలోవ : తెలుగుదేశం బలపరిచిన ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ అభ్యర్థి డాక్టర్ వేపాడ చిరంజీవిరావును గెలిపించాలని కోరుతూ సోమవారం ఆపార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహించాయి. ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ఆదేశాల మేరకు 12వ వార్డు టిడిపి ఇన్‌చార్జ్ ఒమ్మి అప్పలరాజు ఆధ్వర్యంలో శ్రీలీలాసుందరయ్యనగర కరపత్రాలు పంచుతూ నిర్వహించిన ప్రచారంలో టిడిపి నాయకులు గాడి సత్యం, ఒమ్మి పోలారావు, ఎడువాక సన్యాసిరావు, మీసాల సత్తిబాబు, కొత్తల గోపాల్,బండారు శంకర్రావు, దువ్వి తాతారావు, ఒమ్మి రాజు, ఇల్లా లక్ష్మీ పాల్గొన్నారు.

రఘురామ్‌కు కెకె.రాజు పరామర్శ

రఘురామ్‌ను పరామర్శిస్తున్న రాజు

ప్రజాశక్తి- సీతమ్మధార : ఇటీవల సతీవియోగం పొందిన ఎమ్మెల్సీ తలశిల రఘురామ్‌ను ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, రాష్ట్ర నెడ్‌క్యాప్ చైర్మన్ కెకె.రాజు పరామర్శించారు. రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణకుమారి ఇటీవలే అనారోగ్యంతో మరణించారు. ఈ నేపథ్యంలో రఘురామ్ నివాసానికి వెళ్లిన రాజు, స్వర్ణకుమారి చిత్రపటానికి నివాళు లర్పించారు. రఘురామ్‌ను పరామర్శించారు.

స్వర్ణకుమారికి నివాళులర్పించిన కాయల

సీతమ్మధార: అనారోగ్యంతో కన్నుమూసిన సీఎం ప్రోగ్రాం కోఆర్డినేటర్, ఎమ్మెల్సీ తలశిల రఘురామ్ సతీమణి తలశిల స్వర్ణకుమారి సంస్మరణ సభలో ఆంధ్రప్రదేశ్ మారిటైం బోర్డ్ చైర్మన్ కాయల వెంకటరెడ్డి పాల్గొని స్వర్ణకుమారికి నివాళు లర్పించారు. రఘురామ్‌ను పరామర్శించారు.

డిమాండ్ల సాధనకు పెన్షనర్ల ధర్నా

కమిషనర్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఇపిఎఫ్ పెన్షనర్లు

ప్రజాశక్తి-కరాస : డిమాండ్లను సత్వరమే నెరవేర్చాలని కోరుతూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్, విశాఖ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో పిఎఫ్ రీజనల్ కార్యాలయం వద్ద సోమవారం ఇపిఎఫ్ 95 పెన్షనర్స్ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు బీటీ మూర్తి మాట్లాడుతూ, కోర్టు తీర్పును అమలు చేయాలని, పెన్షనర్లందరికీ హయ్యర్ పెన్షన్, రూ.తొమ్మిది వేలు కరువుభత్యం, భార్యాభర్తలకు వైద్య సదుపాయం, 2014 ముందు, తర్వాతన్న క్లాసులు రద్దు, హయ్యర్ పెన్షన్ పొందుతున్న వారికి నిలుపుదల చేసిన ఇపిఎఫ్ చెల్లింపు తదితరసమస్యలను పరిష్కరించాలని కోరారు.. అనంతరం పిఎఫ్ కమిషనర్‌కు వినతిపత్రం అందించారు.కార్యక్రమంలో యువిఎస్ఎన్ వర్మ , జిల్లా కార్యదర్శి జె.కోటేశ్వరరావు, కె.సూర్యచంద్రరావు, కె నూకరాజు, పి భాస్కరరావు, శ్రీనివాసమూర్తి, తులసిరావు, జి సూర్య ప్రకాశరావు పాల్గొన్నారు.

క్షతగాత్రులకు పరామర్శ

ప్రజాశక్తి- మాధవధార : విశాఖ స్టీల్ ప్లాంట్‌లో ఎస్ఎంఎస్-2లో లిక్విడ్ స్టీల్ పడి, గాయాలతో సెవెన్ హిల్స్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను ఎపి రాష్ట్ర కాంగ్రెస్ ఒబిసి విభాగం చైర్మన్ మూల వెంకటరావు సోమవారం ఆసుపత్రికి వెళ్లి పరామర్శించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. క్షతగాత్రుల కుటుంబసభ్యులతో మాట్లాడి, ధైర్యం కల్పించారు. స్టీల్‌ప్లాంట్‌తోపాటు ఇతర పరిశ్రమల్లో తరచూ ప్రమాదాలు చోటుచేసుకోవడం విచారకరమని, ఇలాంటి ఘటనలను పునరావృతం కాకుండా చర్యలు చేపట్టాలని కోరారు.

ఉత్సాహంగా ఎడ్ల బళ్ల పోటీలు

ఎడ్ల బళ్ల పోటీలను ప్రారంభిస్తున్న ముత్తంశెట్టి మహేష్

ప్రజాశక్తి -ఆనందపురం : మండలంలోని గండిగుండం గ్రామంల్లో భూలోకమాత ఉత్సవాలను పురస్కరించుకొని సర్పంచ్ గండ్రెడ్డి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో ఎడ్ల బళ్ల పరుగుపందెం పోటీలు వైసిపి భీమిలి నియోజకవర్గ ఇన్‌ఛార్జి ముత్తంశెట్టి మహేష్ ప్రారంభించారు. విశాఖపట్నం విజయనగరం శ్రీకాకుళం తూర్పుగోదావరి జిల్లాల నుంచి 45 ఎడ్లబళ్లు పోటీల్లో పాల్గొనగా, విజేతకు రూ.15వేలు, వరుసగా ఏడుస్థానాల్లో నిలిచిన ఎడ్లబళ్లకు నగదు ప్రోత్సాహకాలను సర్పంచ్ ఆర్థికసాయంతో అందించారు. ఈ సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు, కోలాటం, బాణాసంచా ఏర్పాటు చేశారు. వైసిపి నేతలు బంక సత్యనారాయణ, కోరాడ వెంకట్రావు బంటు చిన్న, ఎర్ర శీను పాల్గొన్నారు
కనమాం పంచాయితీ ఎర్రవానిపాలెంలో స్థానిక వైసిపి నేతలు పిన్నింటి శెట్టి సింహాచలంనాయుడు, గ్రామ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఎడ్ల బళ్ల పోటీలలో 22 ఎడ్లబళ్లు పాల్గొనగా విజేతలకు నగదు బహుమతులను అందించారు.

ఎల్‌పిసి ఇవ్వాలని వినతి

ప్రజాశక్తి-పద్మనాభం : తమ వద్ద నుంచి పంచాయతీ తీసుకున్న 20సెంట్లు భూమికి బదులుగా ప్రభుత్వం ఇచ్చిన ఐదు సెంట్లు స్థలానికి ల్యాండ్ పొజిషన్ సర్టిఫికెట్ (ఎల్‌పిసి) ఇవ్వాలని మండలంలోని కృష్ణాపురం అంబేద్కర్ కాలనీకి చెందిన ములపర్తి సూరిబాబు, చిన్నయ్యలు సోమవారం స్థానిక ఇన్‌ఛార్జి తహశీల్దార్ వేణుగోపాలరావుకు వినతిపత్రం అందించారు. స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు గడపగడపకూ కార్యక్రమంలో తమ వినతికి స్పందించి, ఐదు సెంట్లు భూమి ఇవ్వాలని ఆదేశించగా, అధికారులు భూమి కేటాయించినా ఎటువంటి ఆధారాలు ఇవ్వలేదని అంటున్నారు.

డంపింగ్ యార్డ్ ఎత్తేయాల్సిందే...

రామచంద్రనగర్ వద్ద 16 గ్రామాల ప్రజలు మహాధర్నా

ధర్నాలో మాట్లాడుతున్న కార్పొరేటర్ గంధం శ్రీనివాస్

ప్రజాశక్తి గాజువాక : 76వ వార్డు రామచంద్రనగర్ గ్రామాన్ని ఆనుకుని ఉన్న డంపింగ్ యార్డ్ ఎత్తేయాలని కోరుతూ 16 గ్రామాల ప్రజలు డంపింగ్ యార్డ్ వద్ద సోమవారం పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. రామచంద్రనగర్ రిక్షాకాలనీ, బర్మా కాలనీ, స్వతంత్ర నగర్, గాంధీనగర్ డెయిరీ కాలనీ, హౌసింగ్ బోర్డ్ కాలనీ, పెద్ద నడుపూరు, చిన్న నడుపూరుతదితర గ్రామాల ప్రజల ఆందోళనకు పలు రాజకీయపార్టీలు సంఘీభావం ప్రకటించి, డంపింగ్‌యార్డు ఎత్తివేత పోరాటంలో పాల్గొంటామని భరోసానిచ్చారు.
ఆందోళనలో పాల్గొన్న వార్డు కార్పొరేటర్ గంధం శ్రీనివాస్ మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ దుర్గంధం, కాలుష్యంతో పరిసర ప్రాంతాల ప్రజలు అనారోగ్యం పాలై మృత్యువాత పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జివిఎంసి కౌన్సిల్ సమావేశంలో దీనిపై చర్చించి, డంపింగ్ యార్డు తరలింపునకు తనవంతు పోరాటం చేస్తానని భరోసానిచ్చారు.స్థానిక ఎమ్మెల్యేతో మాట్లాడి, డంపింగ్ యార్డు తరలించే చర్యలు చేపడతానన్నారు. సిపిఎం కార్యదర్శి రాంబాబు మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్ తరలింపునకు ప్రజలను సమీకరించి, ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామన్నారు. జనసేననేత మురళి మాట్లాడుతూ, డంపింగ్ యార్డ్‌తో స్థానికుల ఇబ్బందుల దృష్ట్యా, ఎత్తివేత పోరాటానికి మద్దతునిస్తామన్నారు. వైసిపి నేత రంభ నారాయణమూర్తి మాట్లాడుతూ ఆరు నెలల్లో డంపింగ్‌యార్డు తరలిస్తామన్న హామీని పలు కారణాల వల్ల నెరవేర్చలేకపోయామని, ఎమ్మెల్యేతో మాట్లాడి, తక్షణమే తరలింపు చర్యలు చేపడతామన్నారు. కార్యక్రమంలో రామచంద్రనగర్ గ్రామ ప్రెసిడెంట్ బలగ రామారావు, కార్యదర్శి డి.రమణ, శరత్, జనసేన నేతలు గోవిందు, భాస్కరరావు, నాయుడు, గాంధీనగర్ సత్య నారాయణ, వందలాదిమంది ప్రజలు పాల్గొన్నారు.

రాజీవ్ గృహకల్పలో మౌలిక సదుపాయాలు కల్పించాలి

జోనల్ కార్యాలయం ఎదుట సిపిఎం ధర్నా

జోనల్ కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న సిపిఎం నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : నాలుగోవార్డు పరిధిలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో మౌలిక వసతులు కల్పించాలని డిమాండ్ చేస్తూ సిపిఎం భీమిలి జోన్ కమిటీ ఆధ్వర్యంలో సోమవారం జోనల్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ జోన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్ మూర్తి మాట్లాడుతూ, మరమ్మతులకు గురైన మోటార్లను బాగుచేయించి, తాగునీటి సమస్య పరిష్కరించాలని, కాలువల్లోని పూడికలు తొలగించి, పారిశుధ్యం మెరుగుపరచాలని, నివాసాల మధ్య పేరుకుపోయిన పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు తొలగించాలని కోరారు.సమస్యలను పరిష్కరించకుంటే ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు రవ్వ నరసింగరావు, ఎస్ అప్పలనాయుడు, అన్నాబత్తుల నరసింగరావు, మాజీ కౌన్సిలర్ అనకాపల్లి వెంకటరావు పాల్గొన్నారు అనంతరం జెడ్‌సి బొడ్డేపల్లి రాముకు వినతిపత్రం అందజేశారు.

మధురానగర్ పాఠశాలను కేంద్ర బృందం సందర్శన

పాఠశాల సందర్శనలో కేంద్ర బృందం ప్రతినిధులు

ప్రజాశక్తి-సీతమ్మధార: జీవీఎంసీ మధురానగర్ పాఠశాలను సోమవారం నేషనల్ ఎక్స్ప్యూజర్ విజిట్ ఆఫ్ మోనిటరీ టీచర్స్ ఆఫ్ ఢిల్లీ కేంద్ర బృందం సందర్శించింది. పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వం చేపట్టిన నాడు నేడు, జగనన్న విద్యాకానుక, గోరుముద్ద కార్యక్రమాలను పరిశీలించి అభినందించారు తరగతి గదిలో విద్యార్థుల అభ్యసన స్థాయి,ఉపాధ్యాయుల పాఠ్యప్రణాళిక, డైరీ టీచింగ్ పరిశీలించారు. జిల్లా విద్యాశాఖ అధికారులు రూపొందించి పదో తరగతి విద్యార్థులకు వందరోజుల ప్రణాళికలో ప్రత్యేక బోధనఅమలును పరిశీలించారు. 8వ తరగతి విద్యార్థుల ట్యాబ్ టీచింగ్, లెర్నింగ్‌ను పరిశీలించి, విద్యార్థులతో మాట్లాడారు. కార్యక్రమంలో డిఇఒ ఎం చంద్రకళ, డిప్యూటీ ప్రిన్సిపల్ శ్రీనివాసరావు, డిఐ సుసర్ల, కేంద్ర బందం హెచ్ఎంలు శాంతికుమారి, దేముడు బాబు తదితరులు పాల్గొన్నారు.

కేంద్ర బడ్జెట్‌పై 'గీతం' వర్సిటీలో వర్క్‌షాప్

జ్యోతిప్రజ్వలనతో వర్క్‌షాప్ ప్రారంభిస్తున్న పురందరేశ్వరి

ప్రజాశక్తి- మధురవాడ : కేంద్రబడ్జెట్‌పై విద్యార్థులలో అవగాహనకు సోమవారం గీతం విశ్వవిద్యాలయంలో ప్రత్యేక వర్క్‌షాప్ నిర్వహించారు. ముఖ్యఅతిథి కేంద్ర మాజీ మంత్రి దగ్గుబాటి పురందేశ్వరి మాట్లాడుతూ, కేంద్రబడ్జెట్‌లో మహిళ సాధికారికత, యువతలో నైపుణ్యాల పెంపు, విద్యారంగం ప్రగతికి పెద్దపీట వేశారన్నారు. కోవిడ్ మహమ్మారితో పాటు రష్యా ఉక్రెయిన్ యుద్ధ ప్రభావం ప్రపంచాన్ని కుదిపేసిన పరిస్థితుల్లోనూ భారత ఆర్థిక రంగం సుస్థిరంగా ముందుకు సాగడానికి కేంద్ర ప్రభుత్వ సంస్కరణలే కారణమన్నారు. ఐఎంఎఫ్ వంటి సంస్థల అంచనాల ప్రకారం భారత స్థూల జాతీయోత్పత్తి 6.8 శాతానికి చేరనుందన్నారు. దేశ జనాభాలో 16 - 33ఏళ్ల మధ్య ఉన్న 140 కోట్ల యువ జనాభాను దేశ, ప్రపంచ ఆర్థిక రంగంలో భాగస్వామ్యం చేసేలా నైపుణ్యాల పెంపుపై కేంద్ర బడ్జెట్‌లో కేటాయింపులు ఉన్నాయన్నారు. ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ ఛార్టెడ్ అకౌంటెంట్ లంక దినకర్ మాట్లాడుతూ రూ.15 లక్షల కోట్ల క్యాపిటల్ ఎక్స్‌పెండీచర్‌తో మౌలిక సదుపాయాలు మెరుగుతో పాటు పరోక్షంగా లక్షలాది మందికి ఉపాధి లభిస్తుందన్నారు. గీతం కేంపస్ లైఫ్ ప్రో వైస్‌ఛాన్సలర్ ప్రొఫెసర్ వై.గౌతమ్‌రావు అధ్యక్షత వహించగా, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డి.గుణశేఖరన్ పాల్గొన్నారు.

'గడప గడపకు' అమలులో భీమిలికి పదో స్థానం

ప్రజాశక్తి -భీమునిపట్నం : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న 'గడప గడపకు మన ప్రభుత్వం' కార్యక్రమం అమలులో రాష్ట్రంలోని 175 నియోజక వర్గాల్లో, భీమిలి 10వ స్థానంలో నిలిచిందని స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు క్యాంప్ కార్యాలయ వర్గాలు తెలిపాయి. ఈ మేరకు స్థానిక ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావును సిఎం జగన్మోహనరెడ్డి ప్రత్యేకంగా అభినందించారని తెలిపారు.

శిక్షణార్థులకు సర్టిఫికెట్ల పంపిణీ

సర్టిఫికెట్లతో శిక్షణ పొందిన అభ్యర్థులు

ప్రజాశక్తి -కంచరపాలెం: కంచరపాలెం బిఎన్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలు అంశాల్లో శిక్షణ పొందిన వారికి సోమవారం సర్టిఫికెట్లను పంపిణీ చేశారు. రోటరీ క్లబ్ విశాఖపట్నం అధ్యక్షులు మధు పాల్గొని, యోగాతోపాటు బహుముఖ సేవా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్న బిఎన్ఆర్ ఫౌండేషన్ నిర్వాహకులను అభినందించారు. ఫౌండేషన్ కన్వీనర్ బుజ్జి అధ్యక్షతన జరిగిన ఈ సభలో రోటరీ క్లబ్ మహిళ కార్యక్రమాల ప్రధాన నిర్వాహకురాలు మోదమాంబిక, ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ పిడిఎఫ్ అభ్యర్థి కోరెడ్ల రమాప్రభ, ఫౌండేషన్ ప్రధాన నిర్వాహకులు ఎస్ అప్పలరాజు, టైలరింగ్ టీచర్ పి సావిత్రి, కంప్యూటర్ కోర్సుల ఫ్యాకల్టీ కె ప్రభాకర్, కాంపిటేటివ్ ఎగ్జామ్స్ ఫ్యాకల్టీ సతీష్, స్పోకెన్ ఇంగ్లీష్ టీచర్ కష్టారావు, డయాగ్నొస్టిక్ సెంటర్ నిర్వాహకులు విజయ, హోమియో డాక్టర్ నమ్మి సరళ, విసిసి నిర్వహణ సహాయకులు పి రామారావు, పాల్గొన్నారు. ఫౌండేషన్ సేవలకు ఆర్థికచేయూతనందిస్తున్న రోటరీ క్లబ్‌కు కన్వీనర్ బుజ్జి ధన్యవాదాలు తెలిపారు. వంది మంది విద్యార్థులు, మహిళలకు సర్టిఫికెట్లను అందజేశారు.

వైసిపి పతనం తథ్యం

జగనాసుర రక్త చరిత్ర పోస్టర్ ఆవిష్కరణలో రాజాబాబు

ప్రజాశక్తి -భీమునిపట్నం : రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో వైసిపి ప్రభుత్వ పతనం తథ్యమని టిడిపి నియోజక వర్గ ఇన్‌ఛార్జి కోరాడ రాజబాబు అన్నారు. సోమవారం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ స్థాయి ముఖ్య నేతల సమావేశంలో జగనాసుర రక్త చరిత్ర పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, వైసిపి పాలనలో అన్ని తరగతుల ప్రజలు అవస్థలు పడుతున్నారన్నారు.వివేకా హత్య కేసు నుంచి ప్రజల దృష్టి మరల్చడానికే మళ్లీ మూడు రాజధానుల డ్రామా తెరపైకి తెచ్చిందన్నారు.వార్డు, గ్రామాల్లో టిడిపి నిర్వహిస్తున్న రచ్చబండ కార్య క్రమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు, 1,2,4 వార్డుల పార్టీ అధ్యక్షులు టి సూరిబాబు, బడిగిం టి నీలకంఠం, పాసి నరసింగరావు, పార్టీ మండల అధ్యక్షులు డిఎఎన్ రాజు, నగర కార్యదర్శి పిట్టా సురేష్, మాజీ కౌన్సిలర్ గొలగాని నరేంద్ర కుమార్, గరే సదానంద, పాసి త్రినాధ్‌కుమార్ పాల్గొన్నారు.

సిసి రోడ్డుపై బోరును తొలగిస్తాం

ప్రజాశక్తి-పద్మనాభం : మండలంలోని బి.తాళ్లవలస పంచాయతీలో మాజీ సర్పంచ్ కొండపల్లి సన్యాసినాయుడు ఇంటి ముందు సిసి రోడ్డుపై వేసిన బోరును తొలగిస్తామని గ్రామ కార్యదర్శి గురునాధరావు తెలిపారు. సోమవారం సిసిరోడ్డుపై వేసిన బోరును పరిశీలించారు. ప్రజల రాకపోకలకు ఇబ్బందిగా ఉన్నందున దీన్ని వెంటనే తొలగిస్తామన్నారు.

గిరిజన భూముల్లో ఉన్న నల్లరాయి క్వారీ లీజు రద్దుచేయాలని ధర్నా

పర్యావరణ అనుమతులు తిరస్కరించాలని డిమాండ్

ప్రజాశక్తి-అనకాపల్లి

జిల్లాలోని రావికమతం మండలం మరుపాక రెవెన్యూ సర్వే నెంబర్ 258లో గిరిజన భూముల్లో 22 ఎకరాలకు నల్లరాయి క్వారీకి ఇచ్చిన లీజు రద్దు చేయాలని, పర్యావరణ అనుమతులను తిరస్కరించాలని, దీనిపై జాయింట్ కలెక్టర్‌తో విచారణ చేపట్టాలని కోరుతూ కలెక్టర్ కార్యాలయం ముందు ఆ గ్రామస్తులు సోమవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా బాధిత గిరిజనులు మాట్లాడుతూ ఈ భూముల్లో 14 గిరిజన కుటుంబాలు 20 ఏళ్లుగా గొర్రెలు మేకలు పెంపకం, జీడి మామిడి తోటలు, యూకలిప్టస్ తోటలు వేసుకుని జీవిస్తున్నామని తెలిపారు. ఆ భూముల్లో బిఎంజె అప్పారావు పేరుపై రోడ్డు బిల్డింగ్ మెటల్ స్టోన్ క్రషర్‌కు 2018లో అనుమతులు ఇచ్చారన్నారు. సదరు భూముల్లో పిల్లర్స్ వేయడంతో అప్పట్లోనే రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోలేదని చెప్పారు. గ్రామానికి అతి సమీపంలో క్వారీ ఏర్పాటు చేయడం వల్ల తమ తోటలకు, గొర్రెలు మేకలకు తీవ్ర నష్టం వాటిల్లుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పుడు నివేదికలతో అనుమతులు పొందిన క్వారీ లీజుతో పాటు పర్యావరణ అనుమతులు రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గిరిజనులు మూలపర్తి నూకాలమ్మ, వరహాలమ్మ చిన్నతల్లి, ఏపీ గిరిజన సంఘం ఐదవ షెడ్యూల్ సాధన సమితి గౌరవ అధ్యక్షులు కె.గోవిందరావు, మరుపాక రైతు సంఘం నాయకులు సోమిరెడ్డి పరమేష్, గొర్రెలు మేకల పెంపకం దారులు పాల్గొన్నారు.

కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రావికమతం మండలం మరుపాక గిరిజనులు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్, జెసి తదితరులు

ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి

ప్రజాశక్తి- అనకాపల్లి

మంచి ఆర్థిక క్రమశిక్షణతో అభివృద్ధి సాధ్యమని కలెక్టర్ రవి పఠాన్ శెట్టి అన్నారు. కలెక్టరేట్ కార్యాలయంలో సోమవారం ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాల్లో భాగంగా 'మంచి ఆర్థిక ప్రవర్తన –మీ రక్ష' పోస్టర్‌ను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 13 నుంచి 17వ తేదీ వరకు ఆర్థిక అక్షరాస్యత వారోత్సవాలను నిర్వహిస్తున్నామన్నారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ, డిఆర్‌డిఏ ప్రాజెక్ట్ అధికారి లక్ష్మీపతి, ఎల్‌డిఎం సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అమిత్ కుమార్‌ను అభినందిస్తున్న సంఘం నాయకులు

గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ సహాయ కార్యదర్శిగా అమిత్ కుమార్

ప్రజాశక్తి-చోడవరం

ఉత్తరాంధ్ర సామాజిక గ్రామీణ వైద్యుల సంక్షేమ సంఘం జోనల్ సహాయ కార్యదర్శిగా బుచ్చయ్యపేట మండలం విజయరామరాజుపేట గ్రామానికి చెందిన గ్రామీణ వైద్యుడు దొడ్డి అమిత్ కుమార్, జోనల్ ఈసీ మెంబర్‌గా దేవరపల్లి మండలం కలిగట్ల గ్రామానికి చెందిన రాపేటి ఆదినారాయణ ఎన్నికయ్యారు. సోమవారం చోడవరంలోని సంజీవని హాస్పిటల్‌లో జరిగిన గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు అనంతరం ఎన్నిక నిర్వహించారు. ఆదివారం ఉదయం చోడవరంలోని సంజీవని హాస్పిటల్‌లో గ్రామీణ వైద్యులకు వైద్య విజ్ఞాన అవగాహన సదస్సు జరిగింది. అనంతరం అమిత్‌కుమార్, ఆదినారాయణను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథులుగా విచ్చేసిన డాక్టర్ ఆడారి చంద్రశేఖర్, డాక్టర్ త్రిలోక్ చంద్, డాక్టర్ బండారు బాలకృష్ణ, డాక్టర్ సోనియా, డాక్టర్ నిరుపమ, జోనల్ అధ్యక్షులు జంగం జోషి, గౌరవాధ్యక్షులు మమ్ముల తిరుపతిరావు, కార్యదర్శి సుగుణేశ్వరి, ఫెడరేషన్ రాష్ట్ర సలహాదారు డాక్టర్ ఎన్ఎల్ రావు, అల్లాడ త్రినాధరావు, కనకరావు, ఆకుల శ్రీనివాస్, వెంకట్రావు, లోగిషా గణేష్, నిముషకవి రాజు, ఏవి శ్రీకాంత్, ఈశ్వరరావు, ఐకే రావు, ఏకే మలాకర్, ఆడారి రమణ, వీరభద్ర రావు, అలకరాజు, రమణాజీ, రమణారావు తదితరులు కొత్తగా ఎన్నికైన అమిత్‌కుమార్, ఆదినారాయణను అభినందించారు.

వ్యవసాయ శాఖ సహాయ సంచాలకులుగా రవిప్రకాష్

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్



ఎలమంచిలి వ్యవసాయశాఖ నూతన సహాయ సంచాలకులుగా రవి ప్రకాష్ స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రైతులకు అందుబాటులో ఉంటూ సూచనలు సలహాలను అందిస్తామని చెప్పారు. అనంతరం డివిజన్‌లో పనిచేస్తున్న సిబ్బందితో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను రివ్యూ చేశారు. పొలంబడి, ఈ పంట నమోదు, వైయస్సార్ యంత్ర సేవ పథకం వంటి కార్యక్రమాలపై సమీక్ష చేశారు. ఈ కార్యక్రమంలో సీనియర్ వ్యవసాయ అధికారి సుమంత, సౌజన్య, ఉమాదేవి, శంకర్ గోవిందు, నాలుగు మండలాల్లో పనిచేస్తున్న వ్యవసాయ సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీల్లో ఓవరాల్ ఛాంపియన్ షిప్

ఓవరాల్ ఛాంపియన్‌గా నిలిచిన క్రీడాకారులు

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

రాష్ట్రస్థాయి సీనియర్ తైక్వాండో పోటీల్లో జిల్లా జట్టు ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను సాధించినట్లు జిల్లా తైక్వాండో కోచ్ నగిరెడ్డి సత్యనారాయణ తెలిపారు. ఆదివారం కాకినాడ డిస్ట్రిక్ట్ స్పోర్ట్స్ అథారిటీ స్టేడియంలో జరిగిన 39వ రాష్ట్రస్థాయి సీనియర్ తైక్వాండో ఛాంపియన్ షిప్‌తో పాటు ఉమెన్ ఛాంపియన్ షిప్ ప్రథమ స్థానాన్ని కూడా కైవసం చేసుకున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో బాలికల విభాగంలో యు.జయశ్రీ, టి.శ్వేత, లిఖిత బంగారు పతకాలు, బి. భవాని రజత పతకం, ఆర్. పల్లవి కాంస్య పతకం సాధించగా, బాలుర విభాగంలో నాగేశ్వరరావు, విజయ్ కుమార్, గురు ప్రసాద్ నాయుడు స్వర్ణ పతకాలు, విజయ్ మోహన్ శేషు పతకాలు సాధించి ఓవరాల్ ఛాంపియన్ షిప్‌ను దక్కించుకున్నారని తెలిపారు. ఈ పోటీల్లో బంగారు పతకాలు సాధించిన విజేతలు మార్చి 24వ తేదీ నుంచి జరిగే జాతీయస్థాయి పోటీలకు ఎంపికైనట్లు పేర్కొన్నారు. వీరు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం తరఫున ప్రాతినిధ్యం వహిస్తారన్నారు. విజేతలను జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ములంపాక అచ్చం నాయుడు, న్యూ ఆంధ్ర ప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి అభినందించారు.

యోగా గురువు జనార్ధన్‌ను సత్కరిస్తున్న దృశ్యం

యోగాతో శారీరక, మానసిక ఒత్తిడి దూరం

ప్రజాశక్తి-అనకాపల్లి

యోగా ద్వారా శారీరక, మానసిక ఒత్తిడి నుంచి దూరంగా ఉండవచ్చని డైట్ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ చెల్లా నరసింహం అన్నారు. కళాశాలలో సోమవారం యోగా గురువు మాదేటి జనార్ధన్, ఎం.లీల ఆధ్వర్యంలో ప్రాథమిక శారీరక మానసిక, ఆధ్యాత్మిక ఆరోగ్యంపై శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా నరసింహం మాట్లాడుతూ యోగా ద్వారా శారీరక దారుఢ్యం, ధ్యానంతో మానసిక ఆరోగ్యం పెంపొందుతుందని చెప్పారు. విద్యార్థులు ఇటువంటి శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ సందర్భంగా యోగా గురువు జనార్దన్ పలు యోగ ఆసనాలను ప్రదర్శించారు. అనంతరం ఆయనను కళాశాల ఛైర్మన్ దాడి రత్నాకర్, సిబ్బంది సత్కరించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ కోఆర్డినేటర్ కిరణ్ కుమార్, ఫిజికల్ డైరెక్టర్ సిహెచ్ శ్రీనివాసరావు, అకాడమిక్ డీన్ కృష్ణ నాగ్, వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, డీన్ అడ్మిన్ డాక్టర్ కెవిఎస్ ఈశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

106 రోజుకు నేవీ నిర్వాసితుల ఆందోళన

ఆందోళన చేస్తున్న నేవీ నిర్వాసితులు

ప్రజాశక్తి-రాంబిల్లి

తమ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ మండలంలోని వాడనర్సాపురం వద్ద ఎన్ఎఓబి మెయిన్ గేట్ ముందు 8 గ్రామాల నేవీ నిర్వాసితులు చేపట్టిన ఆందోళన సోమవారం నాటికి 106వ రోజుకు చేరింది. ఈ సందర్భంగా నిర్వాసిత జెఏసి నాయకులు మాట్లాడుతూ 106 రోజులైన తమ సమస్యలను పరిష్కరించకపోవడం దారుణమన్నారు. మా భూములు తీసుకొని మాకు ఉద్యోగం అవకాశాలు, ఉపాధి లేకుండా చేస్తారా? అని ప్రశ్నించారు. శారద, వరహా నదుల్లో వేటకు వెళ్లి తమ జీవనాన్ని కొనసాగించేవాళ్లమని, నేవీ వల్ల ఆ నదుల గుండా వేటకు వెళ్లనీయడం లేదని తెలిపారు. నేవీ వల్ల ఉపాధి కోల్పోయిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని చెప్పారని, కాని నేటికీ ఉద్యోగం కాదు కదా నేవీ గేటు కూడా తాకనియ్యట్లేదని ఆవేదన వ్యక్తం చేశారు. 8 గ్రామాల నిర్వాసితులు ఎంతో ఆందోళన చెందుతున్నారని, ఎప్పటికి తమకు న్యాయం చేస్తారని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ప్రశ్నించారు. ఇప్పటికైనా సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకోకుంటే ఆందోళన ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

గుండెపోటుతో పాత్రికేయుడు నానాజీ మృతి

ప్రజాశక్తి-చోడవరం

చోడవరం కేంద్రంగా విలేకరిగా పనిచేస్తున్న మారేడిపూడి నానాజీ సోమవారం ఆకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మరణించారు. నానాజీ కొంతకాలంగా విశాఖ సమాచారం పత్రికలో పనిచేస్తున్నారు. ఆయన పలువురి ప్రముఖులతోనూ, అధికారులు, ప్రజలతోనూ సత్సంబంధం కలిగి ఉండేవాడు. అందరితోనూ మంచితనంగా వ్యవహరిస్తూ ఉండేవాడు. నానాజీ మృతి పట్ల మండలానికి చెందిన పలువురు అధికారులు, రాజకీయ ప్రతినిధులు, పాత్రికేయులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలి

ప్రజాశక్తి-అనకాపల్లి

మహిళలు అన్ని రంగాల్లో ముందుండాలని ఎఎంఎఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్ డాక్టర్ కెవిఎస్ మహేశ్వరరావు అన్నారు. సరోజినీనాయుడు 144వ జయంతి సందర్భంగా కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం, కళాశాల మహిళా సాధికారత విభాగం సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం జాతీయ మహిళా దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సరోజినీ నాయుడును ఆదర్శంగా చేసుకొని ప్రస్తుత పోటీ ప్రపంచంలో అందుబాటులో ఉన్న సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకొని తమ జీవితంలో పైకి ఎదగాలని సూచించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ అధికారి డాక్టర్ ఎం హరిబాబు, సూపరింటెండెంట్ అనురాధ, మహిళ సాధికారత విభాగం కన్వీనర్ సామ్రాజ్యం, మహిళ అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎఎంఎఎల్ కళాశాల వైస్ ప్రిన్సిపల్

మాట్లాడుతున్న దిబ్బిడి జెడ్‌పి హైస్కూల్ హెచ్ఎం విశ్వేశ్వరరావు

స్వావలంబన్ కార్డుతో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి-బుచ్చయ్యపేట

వికలాంగులకు స్వావలంబన్ కార్డుతో బహుళ ప్రయోజనాలు చేకూరుతాయని దిబ్బిడి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. కాశీ శంకర విశ్వేశ్వరరావు తెలిపారు. సోమవారం పాఠశాలలో సహిత విద్యా వనరుల గదిలో ఏర్పాటు చేసిన తల్లిదండ్రుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాఠశాలలో అమలు చేయుచున్న సహిత విద్యా కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పాఠశాలలో ప్రత్యేకంగా నియమించబడిన ఉపాధ్యాయులు భీశెట్టి అప్పలరాజు వివిధ రకాల సేవలను అందిస్తున్నారని చెప్పారు. 10వ తరగతి పరీక్షలకు ఐదుగురు వికలాంగ బాలబాలికలు హాజరుకాగా వారు ఉత్తీర్ణులు కాగా, ఇద్దరికి వీల్ చైర్స్, ఇద్దరికి వినికిడి యంత్రాలు, ఒకరికి రోలేటర్లు అందజేశామని చెప్పారు. జాతీయ ఉపకారవేతనాలు 11 మంది విద్యార్థులకు పొందడానికి కృషి చేశామని, ఒక్కొక్కరికీ రూ.11వేలు చొప్పున వ్యక్తిగత ఖాతాలో జమచేయబడ్డాయని తెలిపారు. వివిధ రకాల అలవెన్సులు బాలబాలికలకు ఉపకరిస్తున్నాయన్నారు. ప్రత్యేక ఉపాధ్యాయులు అప్పలరాజు మాట్లాడుతూ స్వావలంబం కార్డు ద్వారా అనేకమైన ఉపయోగాలున్నాయన్నారు. తల్లిదండ్రులు సహకరిస్తే పాఠశాలలో చదువుతున్న వికలాంగు బాలబాలికలందరికీ నమోదు చేస్తారని తెలిపారు. దీనికొరకు సదరం సర్టిఫికెట్, ఆధార్ కార్డు, ఫొటోస్, సంతకం, చిరునామా ఆధారం, పెన్షన్ నెంబర్ అవసరమవుతాయని చెప్పారు.

మద్యం విక్రయిస్తున్న ఒక వ్యక్తి అరెస్ట్

ప్రజాశక్తి-యలమంచిలి రూరల్

స్థానిక అయ్యప్ప స్వామి ఆలయ సమీపంలో మద్యం విక్రయిస్తున్న ఎర్రవరం గ్రామానికి చెందిన పి.దాసును పోలీసులు అరెస్టు చేశారు. ఆయన వద్ద ఆరు మద్యం సీసాలు స్వాధీనం చేసుకున్నారు. దాస్‌పై కేసు నమోదు చేసి ఎలమంచిలి కోర్టుకు తరలించినట్లు ఎలమంచిలి టౌన్ ఎస్ఐ పాపినాయుడు తెలిపారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు ఎవరు పాల్పడిన జైలు శిక్ష తప్పదని ఆయన హెచ్చరించారు.

నేడు ముత్యాల అమ్మవారి పండుగ

ప్రజాశక్తి-కశింకోట : మండలంలోని త్యేగాడ గ్రామంలో మంగళవారం ముత్యాల అమ్మవారి పండుగ జరుగుతుందని ఆ గ్రామ సర్పంచ్ నీటిపల్లి ఈశ్వరమ్మ, వైసిపి మండల నాయకులు నీటిపల్లి దివాకర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. అమ్మవారికి మూడు సంవత్సరాలకు ఒకసారి ఈ పండుగ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. పండుగ ఈ సందర్భంగా గ్రామంలో విద్యుత్ అలంకరణ చేశారు.

సంపద కేంద్రం నిర్మాణ పనుల పరిశీలన

ప్రజాశక్తి- మునగపాక రూరల్

మండలంలోని మూలపేట గ్రామంలో సోమవారం చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిర్మాణ పనులను సర్పంచ్ భీశెట్టి గంగ అప్పల నాయుడు పరిశీలించారు. ఈ సందర్భంగా గంగప్పలనాయుడు మాట్లాడుతూ మండలంలో నూతనంగా ఏర్పాటు అయిన పంచాయతీలకు ఇటీవల సంపద తయారీ కేంద్రాలకు నిధులు మంజూరు చేయడం జరిగిందని, దానిలో భాగంగానే గ్రామంలో కూడా నిర్మాణ పనులు చురుగ్గా చేపట్టడం జరుగుతుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు మొల్లేటి గోవిందరావు పాల్గొన్నారు.

సంపద కేంద్రం నిర్మాణ పనులను పరిశీలిస్తున్న సర్పంచ్

'జగనాసుర రక్తచరిత్ర' పుస్తకావిష్కరణ

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న టిడిపి జిల్లా అధ్యక్షులు నాగజగదీశ్వరరావు, టిడిపి నాయకులు

ప్రజాశక్తి-అనకాపల్లి

ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికి నిజాయితీ ఉంటే తన చిన్నాన్న వివేకానంద రెడ్డి హత్య కేసుకు సంబంధించి సిబిఐకి సహకరించి దోషులను శిక్షించేందుకు సహకరించాలని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు డిమాండ్ చేశారు. స్థానిక పార్లమెంటరీ పార్టీ కార్యాలయంలో సోమవారం జగనాసుర రక్త చరిత్ర పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ రెడ్డి వల్ల న్యాయం జరగదని, కేసును తెలంగాణ లేదా కర్ణాటక రాష్ట్రాలకు బదలాయించాలని సుప్రీంకోర్టులో వివేకానందరెడ్డి కుమార్తె మొరపెట్టుకోవడం హత్య వెనుక సూత్రధారులు ఎవరో తేటతెల్లమవుతుందని పేర్కొన్నారు. జగన్ రెడ్డి తన నిజాయితీని నిరూపించుకోవడానికైనా సిబిఐకి సహకరించాలని డిమాండ్ చేశారు. వివేక హత్య కేసు తమ నాయకుడు చంద్రబాబు నాయుడుపై సాక్షి ఛానల్, దినపత్రికలో అబద్ధపు ప్రచారాలతో నారాసుర రక్త చరిత్ర పేరుతో ప్రసారం చేసిన మాట వాస్తవం కాదా అని ప్రశ్నించారు. పుట్టకనుంచి నేరచరిత్ర ఉన్న జగన్ రెడ్డిపై 11 సిబిఐ కేసులు, ఏడు ఈడి కేసులు, 13 పోలీస్ స్టేషన్ కేసులు, 158 స్టే పిటీషన్లు, 320 హాజరు మినహాయింపు పిటిషన్లుతో పాటు 16 మాసాల జైలు కూడు తిన్న ఘన చరిత్ర ఉందన్నారు. సిబిఐ విచారణతో వివేకానంద రెడ్డి హత్య కేసు తాడేపల్లి గుట్టు తేటతెల్లమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు సూరే సతీష్, మల్ల గణేష్, దాడి వీర వెంకట అప్పారావు, కుప్పిలి జగన్మోహన్, దొడ్డి జగదీష్, సాలావు నాయుడు, గుర్రాల వాసు, విల్లూరి రమణ బాబు, బుద్ద భువనేశ్వరరావు, బోడి వెంకటరావు, చదరం శివ అప్పారావు పాల్గొన్నారు.

ఇంటర్ పరీక్షలు పకడ్బందీగా నిర్వహించాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

ఈనెల 20 నుంచి మార్చి ఏడవ తేదీ వరకు నిర్వహించే ఒకేషనల్ ప్రథమ, ద్వితీయ సంవత్సరపు ప్రాక్టికల్ పరీక్షలు, ఈనెల 26 నుంచి మార్చి 7 వరకు ఇంటర్ ద్వితీయ సంవత్సర ప్రాక్టికల్ పరీక్షలు పగడ్బందీగా నిర్వహించాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఆదేశించారు. మార్చి 15 నుంచి ఏప్రిల్ 4వ తేదీ వరకు ఇంటర్మీడియట్ థియరీ పరీక్షలు జరుగుతాయన్నారు. కలెక్టర్ ఛాంబర్లో సోమవారం పరీక్షల నిర్వహణపై ఆర్ఐఒ ఉమా రాణి, సంబంధిత విద్యాశాఖ అధికారులతో సమావేశమయ్యారు. పరీక్షలకు సంబంధించి అన్ని శాఖల అధికారుల సమన్వయంతో, విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా నిర్వహించాలని సూచించారు. ఆర్ఐఒ ఉమా రాణి మాట్లాడుతూ జిల్లాలో ఇంటర్ మొదటి సంవత్సరం 10568 మంది, ద్వితీయ సంవత్సరం 13,100 మంది హాజరవుతున్నారని, ప్రాక్టికల్స్ 65 కేంద్రాల్లో నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సమావేశంలో ఇంటర్మీడియట్ విద్యాధికారిణి బి సుజాత, జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ హేమంత్, ఏపీఈపీడీసీఎల్ డిఇ రమణమూర్తి, అదనపు ఎస్పీ సత్యనారాయణరావు పాల్గొన్నారు.

జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం తరలింపు ఆపాలి

ప్రజాశక్తి- అనకాపల్లి

పట్టణ నడిబొడ్డులో ప్రజలకు అందుబాటులో ఉన్న జిల్లా రిజిస్ట్రార్ కార్యాలయం, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను జాతీయ రహదారి వద్దకు తరలించి ప్రజలను ఇబ్బంది పరిచే ప్రయత్నం తక్షణమే విరమించాలని సమాచార హక్కు ఉద్యమకర్త కాంగ్రెసు వెంకటరమణ విజ్ఞప్తి చేశారు. సోమవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ కార్యాలయ తరలింపుపై ఇప్పటికే స్టాంప్స్ రిజిస్ట్రేషన్ శాఖ కమిషనర్, ఇన్‌స్పెక్టర్ జనరల్, డిఐజి, కలెక్టర్లకు ఫిర్యాదు చేసినట్టు తెలిపారు. బ్రిటిష్ కాలంలో పట్టణ నడిబొడ్డులో సర్వే నెంబర్ 15/4 లో 42 సెంట్లు స్థలంలో ఏర్పాటు చేసిన సబ్ రిజిస్ట్రార్ కార్యాలయం 1856 నుంచి 2019 వరకు నిర్వహించారని తెలిపారు. ఈ భవనం శిథిలావస్థకు చేరడంతో కొత్త భవనం నిర్మించనున్నామని సాకుతో ప్రైవేట్ భవనంలోకి మార్చారన్నారు. అంతకన్నా పురాతనమైన తహశీల్దారు కార్యాలయం మాత్రం ప్రస్తుతం ఉన్న భవనంలోనే కొనసాగడం గమనార్హమని పేర్కొన్నారు. భవనాన్ని తరలించడంలో జరిగిన ఆర్థిక లావాదేవీల్లో అవకతవకలు జరిగినట్లు అప్పట్లో ఆరోపణలు వచ్చాయన్నారు. శిథిలావస్థలో ఉన్న కార్యాలయ భవనం బహిరంగ విలువ రూ.30 కోట్లు ఉంటుందని, అయినా నెలకు రూ.48,600 చొప్పున 2019 ఆగస్టు నుంచి 2023 ఏప్రిల్ వరకు 43 నెలలకు అధికారిక ఒప్పందం ప్రకారం రూ.20.90 లక్షలు చెల్లించారని తెలిపారు. దీనికి నిర్వహణ ఖర్చులు అదనమన్నారు. ప్రభుత్వ సొంత స్థలం ఉండి సొంత భవనం నిర్మించకపోవడం, జిల్లా రిజిస్ట్రార్, సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలను తరలించడంలో గోప్యత పాటించడంపై పలు అనుమానాలు వ్యక్తమవుతున్నాయని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో కక్షిదారులు, రికార్డుల భద్రత దృష్ట్యా ప్రజలకు అందుబాటులో కార్యాలయాన్ని మార్చాలని డిమాండ్ చేశారు.

సమస్యలు వింటున్న కలెక్టర్, జెసి , డిఆర్ఒ

స్పందన అర్జీల సత్వర పరిష్కారం

ప్రజాశక్తి-అనకాపల్లి

వివిధ సమస్యలపై ప్రజలు స్పందన ద్వారా పెట్టుకున్న అర్జీలను అధికారులు పరిశీలించి తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ రవి పటాన్ శెట్టి ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమంలో కలెక్టర్‌తో పాటు జాయింట్ కలెక్టర్ కల్పనా కుమారి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకటరమణ ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 178 అర్జీలు వచ్చాయి. వికలాంగుల నుంచి అర్జీలను డిఆర్ఓ స్వయంగా పరిశీలించి స్వీకరించారు.

ఎస్పీ కార్యాలయంలో.....

ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ గౌతమి సాలి స్వయంగా ఫిర్యాదుదారుల నుంచి స్పందన కార్యక్రమంలో అర్జీలను స్వీకరించారు. వివిధ సమస్యలకు సంబంధించి 43 అర్జీలు వచ్చాయి. వీటిని చట్టపరిధిలో పరిశీలించి సత్వరమే చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు.

పైపుల కోసం చేపట్టిన తవ్వకాలు అడ్డగింత

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని సంతిపురం వద్ద మంచినీటి పైపుల కోసం అక్రమంగా చేస్తున్న తవ్వకాలను ఉగ్గిన పాలెం సర్పంచ్ కలగా గున్నయ్యనాయుడు తదితరులు సోమవారం అడ్డుకున్నారు. సుజల స్రవంతి ద్వారా మంచినీటి సరఫరా చేసేందుకు 110 గ్రామాలకు తాళ్ళపాలెం సంత నుండి కశింకోట వరకు ఏలేరు కాలువ పక్కనుండి మంచినీటి పైపులు వేశారు అయితే సోమవారం ఈ పైపులను జెసిబితో తవ్వి పైపులైన్ పైపులు తీసేశారు. దీంతో కలగా గున్నయ్య నాయుడు జెసిబి డ్రైవర్‌ను ఎందుకు తవ్వుతున్నారని నిలదీశారు. ఈ విషయంపై సుజల స్రవంతి సంపతిపురం మంచినీటి సరఫరా విభాగం ఏఈకు సమాచారం అందించారు. దీనిపై విచారణ జరిపించాలని ఆయన కోరారు. ఇదే అంశంపై ఏఈని వివరణ కోరేందుకు ఫోన్‌లో ప్రయత్నం చేసినా అందుబాటులో రాలేదు.

పంటను పరిశీలిస్తున్న వ్యవసాయశాఖ అధికారులు

ఈ-పంట నమోదు పరిశీలన

ప్రజాశక్తి-వడ్డాది

వ్యవసాయశాఖ డిప్యూటీ డైరెక్టర్ జి.వెంకటేశ్వర్లు సోమవారం వడ్డాది రెవెన్యూ పరిధిలో రబీకి సంబంధించి ఈ పంట నమోదు కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వరి, చెరకు, నువ్వులు, మినుములు, పంటలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి రైతులకు అవగాహన కల్పించారు. ఈ పంట నమోదు కార్యక్రమం వ్యవసాయ శాఖ ద్వారా విఏఏలు ఎటువంటి పొరపాట్లు లేకుండా పూర్తి పారదర్శకంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి ఎడిఎ ఎం.రామారావు, బుచ్చయ్యపేట మండల వ్యవసాయ అధికారి బి.భాస్కరరావు, చోడవరం ఎఇఒ కిరణ్, వడ్డాది విఏఎలు వరప్రసాద్, భాగ్యలక్ష్మి రైతులు పాల్గొన్నారు.

మంచుతో పంటలకు నష్టం

ప్రజాశక్తి -బుచ్చయ్య పేట

మండలంలో పొగ మంచు దట్టంగా కురుస్తుంది. తెల్లవారుజామున నాలుగు గంటల నుండి దట్టంగా కురుస్తుండడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం పొలాలకు వెళ్లి పాలు తీసుకువచ్చే రైతులు మంచుతో అవస్థలు పడుతున్నారు. ఉదయం 8 గంటల వరకు పొగ మంచు కురుస్తూనే ఉంది. ఈ పొగ మంచు వలన వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. పలు గ్రామాల్లో రైతులు వేసిన మినుము, పెసర, జీడి, మామిడి పంటలు పూత మాడిపోతుందని, పంటలకు తీవ్ర నష్టం జరుగుతుందని రైతులు వాపోతున్నారు.

ప్రజాప్రతినిధుల ఫ్లెక్సీలు తొలగింపు

ప్రజాశక్తి-కశింకోట

మండలంలోని తీడ, కన్నూరుపాలెం గ్రామాల్లో ప్రజాప్రతినిధులు ఫ్లెక్సీలను ఎంపిడిఒ కొంకి అప్పారావు సోమవారం దగ్గరుండి తొలగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో రెండు రోజులు ఫ్లెక్సీలు తొలగింపు పూర్తి చేయాలని కార్యదర్శులను ఆదేశించారు. ఎక్కడైనా ఫ్లెక్సీలు ఉన్నట్లు అయితే చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఫ్లెక్సీలు తొలగిస్తున్న ఎంపిడిఒ అప్పారావు తదితరులు

ప్రజాశక్తి 7
మంగళవారం 14 ఫిబ్రవరి 2023

ఆదివాసీ భవనానికి నిధుల మంజూరు

ఎంపీ గొట్టేటి మాధవి

మాట్లాడుతున్న ఎంపీ మాధవి

ప్రజాశక్తి- నర్సీపట్నం టౌన్: కొయ్యూరులో 6 సెంట్ల స్థలం కేటాయించి ఆదివాసీ భవనం నిర్మాణం కోసం నిధులు మంజూరు చేస్తామని అరకు పార్లమెంట్ సభ్యురాలు గొడ్డేటి మాధవి, ఆమె భర్త చారిటబుల్ ట్రస్ట్ వ్యవస్థాపకులు కుసిరెడ్డి శివప్రసాద్ తెలిపారు. స్థానిక రుత్తల కన్వెన్షన్ హాల్లో ఆదివారం రాత్రి గిరిజన ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ఈ భవనానికి ఎంపీ నిధుల నుండి రూ.20 లక్షలు, శివప్రసాద్ తన సొంత నిధులు రూ.5 లక్షలు కేటాయిస్తామన్నారు. నర్సీపట్నంలో గిరిజన భవన్‌ను త్వరలోనే ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సందర్భంగా హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఎంపికి పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నాయకులు టి.మల్లీష్ మాట్లాడుతూ, అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాలకు సంబంధించి ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో కుక్, కమాటీ, వాచ్మెన్ పోస్టులను మంజూరు చేయాలన్నారు. ఇదే విషయమై పలుమార్లు ఈ సమస్యపై ఐటిడిఎ, డిడికి, ట్రైబల్ వెల్ఫేర్ హెడ్ అధికారులు, ప్రజాప్రతినిధులకు తెలియజేశామన్నారు. ప్రస్తుతం స్టూడెంట్స్ డైట్ చార్జెస్ మెనూలో కొత్త విధించి వర్కర్స్‌లకు శాలరీ ఇస్తున్నామని, దీంతో విద్యార్థుల నుండి తీవ్ర వ్యతిరేకత ఎదురై ఇబ్బందులు ఎదుర్కొంటున్నామన్నారు. ట్రైబల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లకు అవుట్సోర్సింగ్ ప్రాతిపదికపై వర్కర్స్‌లను నియమించాలని కోరారు. హాస్టల్ మెయింటెనెన్స్‌కు నెలకు రూ. 5వేల చొప్పున కేటాయించాలని తెలిపారు. మిగతా అన్ని జిల్లాల మాదిరిగా జిఒ 559 ప్రకారం(10:1) గ్రేడ్ -1 హాస్టల్ కు వెల్ఫేర్ ఆఫీసర్స్ పోస్టులు కేటాయించి న్యాయం చేయాలన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో హెచ్ డబ్ల్యూ గ్రేడ్-1 పోస్టులు మంజూరయ్యాయని, మరో నాలుగు లేదా ఐదు పోస్టులు కేటాయించాలన్నారు. పాడేరు ఐటిడిఎ పరిధిలో 11 ఏజెన్సీ మండలాలకు ఏడు ఏటిడబ్ల్యూలు మాత్రమే ఉన్నారని, మండలానికి ఒక ఏటిడబ్ల్యూ ఉండే విధంగా మరో నాలుగు పోస్టులను మంజూరు చేయాలని కోరారు. ప్రతీ ప్రీ మెట్రిక్, పోస్టుమెట్రిక్ హాస్టల్స్‌లో హెల్త్ వాలంటీర్లను నియమించాలని, నర్సీపట్నం, చోడవరం, మాడుగుల, అనకాపల్లిలలో ప్రీ మెట్రిక్ హాస్టల్స్ ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు పాల్గొన్నారు.

సర్వే ప్రారంభిస్తున్న సిబ్బంది, ప్రజాప్రతినిధులు

చిన్న బొడ్డేపల్లిలో డ్రోన్ సర్వే

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని చిన్నబొడ్డేపల్లి గ్రామంలో సోమవారం రెవిన్యూ సిబ్బంది డ్రోన్ సర్వే నిర్వహించారు. స్థానిక సర్పంచ్ శివరాం ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. సచివాలయ సర్వేయర్ రజిత మాట్లాడుతూ, గ్రామంలో సుమారు 2000 ఎకరాలకు సర్వే నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోరంబోకు గ్రామకంఠం సహా ప్రభుత్వ, ప్రైవేటు భూములకు సర్వే జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సూర్యనారాయణరావు, మాజీ ఎంపిటిసి సత్యనారా యణ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

నేడు విద్యుత్‌కు అంతరాయం

ప్రజాశక్తి -కొత్తకోట: కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో ఈనెల 14న మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు డిఈఈ జి.సురేష్ బాబు తెలిపారు. సోమవారం కొత్తకోటలో స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, కొత్తకోట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో నెల కొన్న సాంకేతిక లోపాలను సరి చేసేందుకు విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు పేర్కొన్నారు. ఈ కారణంగా మంగళవారం ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకూ కొత్తకోట, టి.అర్జాపురం, దొండపూడి, జే.నాయుడుపాలెం, కన్నంపేట, జెడ్.కొత్తపట్నం, గంప వానిపాలెం, కళ్యాణపులోవ తదితర గ్రామాలలో విద్యుత్ సరఫరా నిలిపి వేస్తున్నట్లు తెలిపారు. ఆయా గ్రామాల వినియోగదారులు ఈ విషయాన్ని గమనించాలని డిఈఈ కోరారు.

అంగన్వాడీ కేంద్రంలో పాము కలకలం

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని చినబొడ్డేపల్లి గ్రామంలోని అంగన్వాడి కేంద్రంలో పాము కలకలం సృష్టించింది. దీంతో, పిల్లలు, సిబ్బంది ఆందోళన చెందారు. ఈ సందర్భంగా అంగన్వాడి టీచర్ భ్రమరాంబ మాట్లాడుతూ, అంగన్వాడి సెంటర్లో కిటికీలు, తలుపులు సక్రమంగా లేక పోవడంతో విష పురుగులు సంచరిస్తున్నాయని తెలిపారు.

కేంద్రంలో సంచరిస్తున్న పాము

ఘనంగా అడవి రాజుల బాబు పండుగ

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్: నర్సీపట్నంలో అడవి రాజులు బాబు పండుగను సోమవారం ఘనంగా నిర్వహించారు. పెద్ద బొడ్డేపల్లిలో ప్రముఖ న్యాయవాది, 15వ వార్డు కౌన్సిలర్ మాకిరెడ్డి బుల్లిదొర ఆధ్వర్యంలో జరిగిన ఉత్సవంలో పెద్ద ఎత్తున ప్రజలు తరలి వచ్చారు. చిటికెల భజన, కోలాటంతో ఊరేగింపు ఆద్యంతం ఆకట్టుకుంది. మధ్యాహ్నం భారీ ఎత్తున అన్న సమారాధన ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ కనకారావు, పట్టణ వైసీపీ అధ్యక్షుడు యాకా శివ, కౌన్సిలర్లు కోనేటి రామకృష్ణ, గుడివాడ రాజుల నాయుడు, నాయకులు పెదిరెడ్ల చింటూ, కన్నయ్య నాయుడు పాల్గొన్నారు.

రోలుగుంట: మండల కేంద్రమైన రోలుగుంట గ్రామంలో సోమవారం అడవిరాజులబాబు పండుగ ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెల్లవారుజాము నుంచి దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం బాణాసంచా కాల్చారు.

ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్

భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి -రోలుగుంట: మండలంలోని ఎంకె.పట్నం శివారు పెదపేట గ్రామానికి ఆనుకొని ఉన్న వీరగంగాలమ్మ తల్లి ఎండోమెంట్ భూమి సర్వే నెంబరు 23/1లో 38 సెంట్ల స్థలాన్ని కొందరు వ్యక్తులు ఆక్రమించారని సోమవారం స్పందనలో ఆర్డీవో జయరామకు వినతిపత్రం ఇచ్చినట్లు ఎంకె.పట్నం సర్పంచ్ భర్రింగ్ సతీష్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వీరగంగాలమ్మ పండుగను మండలంలోని పెదపేట, ఎం.పెదపేట, శింగరాజుపేట, గొల్లగొండ మండలం యర్రన్నపేట గ్రామస్తులు నిర్వహించడం జరుగుతుందన్నారు. గంగాలమ్మ గుడికి సంబంధించి 23/1లో 38 సెంట్లు దేవుని మాన్యం ఉందని, దీన్ని సమీప రైతులు ఆక్రమించారని ఆర్డీవోకు తెలిపారు. తక్షణమే స్పందించి గంగాలమ్మ మాన్యాన్ని రికార్డుల్లో ఉన్న భూమిని ఇప్పించాలని వారు కోరారు.

తీర్థాల్లో అశ్లీలనృత్యాలు నిషేధం

సిఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్

ప్రజాశక్తి- రావికమతం: మండలంలో పలు గ్రామాలలో నిర్వహించే తీర్థాలలో ఎటువంటి అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడినా చర్యలు తప్పవని కొత్తకోట సిఐ సయ్యద్ ఇలియాస్ అహ్మద్ తెలిపారు. ఈ సందర్భంగా రావి కమతం పోలీస్ స్టేషన్లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చట్ట విరుద్ధమైన కార్యక్రమాలు గ్రామాలలో ఎవరు నిర్వహించ రాదన్నారు. గ్రామ పంచాయతీలో ప్రజా పతినిధులు, పెద్దలు అందరూ సహకరించాలని ఆయన కోరారు. సాంప్రదాయక కార్యక్రమాలు నిర్వహించుకోవాలని ఆయన సూచించారు. తప్పు చేస్తే క్షమించేదిక్షమి లేదని ఆయన హెచ్చరించారు.

పలు చోట్ల వైద్యశిబిరాలు

ప్రజాశక్తి-కోటవురట్ల: ప్రతి ఒక్కరు ఆరోగ్యం పట్ల నిర్లక్ష్యం చూపకుండా వైద్య పరీక్షలు చేయించుకోవాలని వైద్యులు బాలాజీ సూచించారు. సోమవారం మండల కేంద్ర సచివాలయం వద్ద ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్ లో భాగంగా వైద్య సేవలు అందించారు. దాదాపు 80 మంది రోగులకు వైద్య పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సకాలంలో మందులు తీసుకోవాలన్నారు. గ్రామ గ్రామాన వైద్య సేవలు అందుతున్నందున సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ అనిల్ కుమార్, కార్యదర్శి సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

నక్కపల్లి: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం జిల్లా అంధత్వ నివారణ సంఘం ఆధ్వర్యంలో కంటి వైద్య శిబిరం నిర్వహించారు. ఆప్తాల్మిక్ ఆఫీసర్ గణపతిరావు విద్యార్థులకు కంటి పరీక్షలు చేశారు. సుమారు 691 మంది విద్యార్థులకు నేత్ర పరీక్షలు చేసి వారిలో 44 మందికి దృష్టి లోపం ఉన్నట్లు గుర్తించినట్లు గణపతిరావు తెలిపారు. వీరికి ఉచితంగా కళ్ళజోళ్లు మంజూరుకు జిల్లా అంధత్వ సంఘానికి సిఫార్సు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎమ్ రాణిలలిత, ఉపాధ్యాయులు ఎన్‌వివిఎస్ ఆచార్యులు, తోడపు వెంకట రమణ, సిఆర్‌పి అప్పారావు పాల్గొన్నారు.

పరీక్షలు చేస్తున్న వైద్యులు

ర్యాలీ చేస్తున్న వైద్యాధికారులు, సిబ్బంది

కుష్టుపై అవగాహన ర్యాలీ

ప్రజాశక్తి -ఎస్.రాయవరం: ఎస్.రాయవరం గ్రామంలో కుష్టు వ్యాధి నివారణపై అవగాహనా ర్యాలీ నిర్వహించినట్లు వైద్యాధికారి ఎస్ఎస్ శక్తిప్రియ తెలిపారు. సర్వసిద్ధి ప్రాథమిక ఆరోగ్య కేంద్రం మెడికల్ ఆఫీసర్ ఎస్ఎస్ శక్తిప్రియ, ఆరోగ్య విస్తరణాధికారి సత్యనారాయణ ర్యాలీని నిర్వహించారు. చర్మంపై స్పర్శ లేని రాగి రంగు మచ్చలు, చేతి వేళ్ళు, పాదాల్లో నరాల్లో తిమ్మిర్లు వంటి లక్షణాలు లెప్రసీగా భావించవచ్చునన్నారు. మెయిన్ బజార్ సర్కిల్ లో విద్యార్థులతో మానవహారం నిర్వహించారు. వ్యాధి లక్షణాలు, ఉచితంగా అరు నెలపాటు ప్రభుత్వం అందించే చికిత్స పై ఎఫ్‌పిసి క్లస్టర్ పర్యవేక్షకులు పి.ఎస్.వి.ఎస్.ప్రసాద్ అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో సచివాలయం వన్, టు హెల్త్ సెక్రటరీలు పి. శ్రీరాములు, పి. నూకరత్నం, సర్పంచ్ భూపతి అప్పారావు, ఎం.పి.టి.సి బైపా శ్రీనివాసరావు, పంచాయతీ సెక్రటరీ లక్ష్మణ రావు పాల్గొన్నారు.

పిల్లల్లో అభ్యసనా నైపుణ్యం పెంచాలి

మండల లిప్ మానిటరింగ్ అధికారి నూకరాజు

ప్రజాశక్తి-నక్కపల్లి: ప్రాథమిక స్థాయి నుండే విద్యార్థులలో అభ్యసనాభివృద్ధి అమలు చేసి నైపుణ్యం పెంచాలని మండల లిప్ మానిటరింగ్ అధికారి వేమగిరి నూకరాజు సూచించారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం ఎంఈఓ డివిడి ప్రసాద్ ఆధ్వర్యంలో నక్కపల్లి, పాయకరావుపేట మండలాలలో ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుల లిప్ స్కూల్ కాంప్లెక్స్ ఒకరోజు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వేమగిరి నూకరాజు మాట్లాడుతూ, బోధనలో పిల్లల పూర్వ జ్ఞానాన్ని పరిశీలించి తదనుగుణంగా బోధించాలన్నారు. చదవడం, రాయడం పై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. అందుబాటులో ఉన్న వనరులను ఉపయోగించుకుని కృత్యాలతో ఆసక్తి కలిగించేలా బోధించాలన్నారు. భాషా సామర్థ్యాలపై దృష్టి పెట్టాలని సూచించారు. నిరంతర బోధనతో పాటు పిల్లల స్థాయిని మదింపు చేయాలన్నారు. నేర్చుకునే క్రమంలో భాషా సామర్థ్యం అత్యంత కీలకమైందని గుర్తించాలన్నారు. ఈ శిక్షణ తరగతులు ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు నిర్వహించాలన్నారు. ఉపాధ్యాయులు సందేహాలను ఈ తరగతులలో నివృత్తి చేసుకుని లిప్ బోధనపై పూర్తి అవగాహన కల్పించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో హెచ్ఎం రాణి లలిత, తెలుగు ఉపాధ్యాయులు ఎన్‌వివిఎస్ ఆచార్యులు, టీవీ రమణ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న నూకరాజు

ఇఎస్ఐ ఆసుపత్రి నిర్మాణంలో అలసత్వం

సిఐటియు జిల్లా అధ్యక్షుడు కెఎం.శ్రీనివాసరావు

మాట్లాడుతున్న కెఎం శ్రీనివాసరావు

ప్రజాశక్తి- ఉక్కునగరం : షీలానగర్‌లోని ఇఎస్ఐ ఆస్పత్రి నిర్మాణంలో అలసత్వం దుర్మార్గమని సిఐటియు జిల్లా అధ్యక్షులు కెఎం.శ్రీనివాసరావు విమర్శించారు. సోమవారం మల్కాపురంలోని జరనల్ పర్పస్ మెడికల్ కేర్ సబ్ కమిటీ సమావేశంలో మాట్లాడుతూ, .2016లో ఆస్పత్రికి స్థలం కేటాయించినా నేటికీ నిర్మాణం పూర్తిచేయకపోవడం సరికాదన్నారు. ఆసుపత్రి నిర్వహణలో లోపాల కారణంగా అత్యవసర సమయాల్లో అవసరమైన వైద్యసేవలకు ఇఎస్ఐ సభ్యత్వమున్నా కార్మికులు ప్రైవేట్ ఆస్పత్రులను ఆశ్రయించి ఆర్థికంగా, అన్ని విధాలుగా దోపిడీకి గురౌతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సింధియాలో పునరుద్ధరించిన గాంధీగ్రామ్ ఇఎస్ఐ ఆసుపత్రిలో మెడికల్ లేబరేటరీ, ఎక్స్‌రే, స్కానింగ్, ఇతర ప్రాథమిక పరీక్షలకు అవసరమైన సిస్టమ్ అందుబాటులో లేకపోవడంతో ప్రతి చిన్న వ్యాధికీ కెజిహెచ్‌కు రిఫర్ చేయడం దారుణమన్నారు. కార్మికులు కష్టించి సంపాదించిన వేతనంలో ఇఎస్ఐ సభ్యత్వం చెల్లిస్తున్న పరిస్థితుల్లో వారికి సరైన వైద్యసేవలు అందించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. గాజువాక పారిశ్రామిక ప్రాంతంలో 2.30 లక్షల మంది కార్మికులు ఇఎస్ఐ సభ్యత్వం చెల్లిస్తున్నా, వారికి సరైన వైద్యం అందకపోవడం శోచనీయమన్నారు. వీరికి ఇఎస్ఐ ఆసుపత్రుల్లో సరైనవైద్యం అందించని పరిస్థితుల్లో . సూపర్ స్పెషాలిటీ లేదా సెకండ్ కేర్ ఆసుపత్రులకు తరలించాలని డిమాండ్ చేశారు. ఇఎస్ఐ ఆసుపత్రిలో ఆపరేషన్ థియేటర్‌లో ఆధునిక వైద్యసౌకర్యాలు కల్పించాలని, వారానికోసారి కార్డియాలజీ, న్యూరాలజీ, యూరాలజీ వంటి విభాగాల్లో కన్సల్టెంట్ వైద్య నిపుణులను రప్పించి సూపర్ స్పెషాలిటీ సేవలను ప్రారంభించాలని కోరారు. కేన్సర్ రోగులకు నిత్యం వైద్యసేవలను అందించాలని, టీబీ వార్డును ప్రారంభించి, ఇన్‌పేషెంట్లకు భోజన సదుపాయం, ఆసుపత్రి ఆవరణలో పార్కింగ్ సౌకర్యం కల్పించాలని కోరారు. ఇఎస్ఐ డిస్పెన్సరీలలో అవసరమైన మందులు, తగిన సిబ్బందితోపాటు ప్రాథమిక వైద్య సౌకర్యాలను అందించాలని కోరారు

ఈ మేరకు స్టీల్‌ప్లాంట్ కాంట్రాక్టు లేబర్ యూనియన్ సిఐటియు తరఫున పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని యూనియన్ ప్రధాన కార్యదర్శి నమ్మి రమణ, ఇఎస్ఐ బాధ్యులు ఆర్‌టి. రాజు, నారాయణలతో కలిసి అందజేశారు.

విద్యార్థులతో భోజనం చేస్తున్న అధికారులు

వసతి గృహాలు ఆకస్మిక తనిఖీ

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలో ఎస్‌సి, బీసీ బాలుర వసతి గృహాలను సోమవారం ఎంపీడీవో సీతారామరాజు, ఎంఈఓ డివిడి ప్రసాద్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. బీసీ వసతి గృహంలో పది మంది విద్యార్థులు పాఠశాలకు వెళ్లకుండా ఉండటాన్ని గమనించి హాస్టల్ వార్డెన్‌ను ప్రశ్నించారు. రికార్డులను పరిశీలించారు. హాస్టల్ గదులు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా లేవని, మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని, ఆహారం రుచికరంగా ఉండలేదని, మంచినీటి సదుపాయం లేదని వంటి సమస్యలను విద్యార్థులు ఎంపీడీవో దృష్టికి తీసుకువెళ్లారు. వార్డెన్‌పై ఎంపీడీవో అసంతృప్తి వ్యక్తం చేశారు. మెనూ ప్రకారం రుచికరమైన ఆహారాన్ని విద్యార్థులకు అందజేయాలన్నారు. అనంతరం ఏపీ రెసిడెన్షియల్ పాఠశాలను సందర్శించి విద్యార్థినిలతో కలిసి భోజనం చేసారు. స్థానిక ఎంపీపీ స్కూల్ ను తనిఖీ చేసారు.

స్టీల్‌ప్లాంట్
ఉద్యోగ ఖాళీలను భర్తీచేయాలి

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో వేల సంఖ్యలో ఉద్యోగ ఖాళీలు ఉన్నాయని, వాటన్నింటినీ తక్షణం భర్తీ చేయాలని ఐఎన్‌టియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగభూషణం డిమాండ్ చేశారు. స్టీల్‌ప్లాంట్ ఇతర ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద కార్మిక, ప్రజా సంఘాల జెఎసి చేపట్టిన దీక్షలు సోమవారం నాటికి 683వ రోజుకు చేరాయి. దీక్షల్లో ఐఎన్‌టియుసికి చెందిన హెచ్‌పిసిఎల్ కాంట్రాక్ట్ కార్మికులు కూర్చున్నారు. ఈ సందర్భంగా నాగభూషణం మాట్లాడుతూ, ఉద్యోగుల సంఖ్య తక్కువగా ఉండటం వల్ల, ఉన్న ఉద్యోగులపై పనిభారం తీవ్రంగా పెరిగిందన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను లాభాల బాటలో నడిపించడం కోసం, ప్రభుత్వ రంగంలో స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకోవడం కోసం, ఉన్న తక్కువ మంది ఉద్యోగులు, కార్మికులు కూడా ఎక్కువగా శ్రమించాల్సిన పరిస్థితి ఉందన్నారు. స్టీల్‌ప్లాంట్‌లో ఖాళీలను భర్తీ చేసి పని భారం తగ్గించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ లాభాల్లో నడవాలంటే ఉద్యోగుల, కార్మికుల శ్రమ ఒకటే సరిపోదని, దీనికి కేంద్ర ప్రభుత్వ సహాయం కూడా అవసరం అన్నారు. సొంతగనులు కేటాయించడం, బ్యాంకుల నుంచి అవసరమైన రుణ సాయం పొందే అవకాశం కల్పించడం తదితరాలు చేయాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌ను రక్షించుకోవడం కోసం అన్ని కార్మిక సంఘాలు చేస్తున్న పోరాటాన్ని మరింత తీవ్రతరం చేస్తామన్నారు. ఈ దీక్షల్లో వై.నర్సింగ్‌యాదవ్, ఎస్.తాతబాబు, అగస్తియన్, బాబ్జి, సూర్య, దేవుడు తదితరులు కూర్చున్నారు.

రెప్కో బ్యాంకు ప్రత్యేక డిపాజిట్ పథకం

ప్రజాశక్తి-కలెక్టరేట్, విశాఖ : రెప్కో బ్యాంకులో నూతన ప్రత్యేక డిపాజిట్ పథకం "రెప్కో 15 స్పెషల్" (ఇన్ కం అండ్ గ్రోత్) ప్రవేశపెట్టినట్లు ఆశీల్‌మెట్ట బ్రాంచ్ అసిస్టెంట్ జనరల్ మేనేజర్ దీపక్ మిశ్రా ఒక ప్రకటనలో తెలిపారు. భారత ప్రభుత్వ సంస్థ రెప్కో బ్యాంక్ సాధారణ ప్రజలకు 8.05 శాతం అత్యధిక వడ్డీ రేటును అందించడం ఈ పథకం ఉద్దేశం అని పేర్కొన్నారు. ఈ నెల 13 నుంచి అమలులోకి వచ్చే కొత్త ప్రత్యేక ఫిక్స్ డ్ డిపాజిట్ స్కీమ్ "రెప్కో 515 స్పెషల్" ను ప్రారంభించినట్లు తెలిపారు. సీనియర్ పౌరులకు 8.55 శాతం సముచితమైన పెరిడిక్ వడ్డీ చెల్లింపు ఎంపికలు ఉన్నాయని వివరించారు. డిపాజిట్ పథకం యొక్క వ్యవధి 15 నెలలు అని పేర్కొన్నారు. డిపాజిట్ పథకం వివరాలకు తనను కానీ, రామాటాకీస్ రోడ్డులోని బ్రాంచి ఆఫీసులో కానీ సంప్రదించవచ్చని పేర్కొన్నారు. మరినిన వివరాలకు vzg@repcobank.co.in, 0891-2559258, 9490798586ను సంప్రదించాలని సూచించారు.

హెటిరోపై స్పందనలో ఫిర్యాదు

ప్రజాశక్తి -నక్కపల్లి : సిఆర్‌జెడ్ పరిధిలో డీశాలినేషన్ ప్రాజెక్టు నిర్మించుకున్న హెటిరో యాజమాన్యంపై చర్యలు తీసుకోవాలని రాజయ్యపేట పంచాయితీ 10వ వార్డు మెంబర్ ఎం.మహేష్ బాబు సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో ఫిర్యాదు చేశారు. హెట్రో కంపెనీ 15 సంవత్సరాల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా సముద్రపు ఒడ్డున సిఆర్‌జెడ్ పరిధిలో డీశాలినేషన్ ప్రాజెక్టు నిర్మించుకుని సముద్ర జలాలను శుద్ధి చేసి వినియోగించుకుంటున్నారని, దీనిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదులో పేర్కొన్నారు. కంపెనీ వ్యర్థ రసాయన జలాలను సముద్రంలోకి వదలడానికి రెండవ పైప్ లైన్ ఏర్పాటును వ్యతిరేకిస్తూ మత్స్యకారులు 2021 డిసెంబర్ 1 నుండి శాంతియుత ధర్నా కొనసాగిస్తున్నారన్నారు. మత్స్యకారుల ఉద్యమాన్ని పరిగణలోకి తీసుకోకుండా పైప్ లైన్ అనుమతులు ఇవ్వడం జరిగిందన్నారు. పైప్ లైన్ వ్యతిరేకిస్తూ ఎన్.జి.టిని కూడా ఆశ్రయించడం జరిగిందన్నారు. మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని పైప్ లైన్ అనుమతులు రద్దు చేయాలని ఫిర్యాదులో పేర్కొన్నారు.

ఫిర్యాదు పత్రం చూపిస్తున్న మహేష్ బాబు

అక్రమ లేఅవుట్

ప్రజాశక్తి- మాకవరపాలెం:మండలంలోని పైడిపాల పంచాయతీ పరిధిలోని తారు రోడ్డును అనుకుని సుమారు 6 ఎకరాల విస్తీర్ణంలో లేఅవుట్ వేసారు. రెవెన్యూ, పంచాయతీల నుండి ఎటువంటి అనుమతులు లేకుండా యధేచ్ఛగా లే అవుట్ వేసి బోర్డులను ఏర్పాటు చేసినా ప్రభుత్వ అధికారులు పట్టించుకోక పోవడం పట్ల పలు అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. లేఅవుట్ ఏర్పాటు చేసిన ప్రాంతంలో ప్రహరీ ఏర్పాటు చేసారు. తారురోడ్డును ఒకవైపు, గెడ్డ ప్రాంతం మరొకవైపు అక్రమణకు గురైందని ఆరోపణలు విని పిస్తున్నాయి . 24 అడుగుల రోడ్డుతో 104 ప్లాట్లకు సంబంధించి బోర్డులను లేఅవుట్ ప్రాంతంలో ఏర్పాటు చేసారు. ఈ విషయంపై స్థానిక విఆర్ఒ లక్ష్మణరావును వివరణ లేఅవుట్ వేసిన భూములకు సంబంధించి ఎటువంటి అనుమతులు లేవని, నాలా కూడా చెల్లించ లేదని తెలిపారు.

అక్రమంగా వెలసిన లేఅవుట్

గృహ నిర్మాణాలు వేగవంతం

ప్రజాశక్తి-రావికమతం:జగనన్న గృహ నిర్మాణాలను వేగవంతం చేయాలని కవగుంట సర్పంచ్ దాసరి సూర్య కుమారివరహాలు తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ గృహ నిర్మాణ శాఖ వర్క్ ఇన్స్పెక్టర్ రాజేంద్రతో కలిసి గ్రామానికి మంజూరైన ఇళ్లు సోమవారం పరిశీలించి లబ్ధిదారులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ,ఇప్పటికే సుమారు పదిమంది ఇంటి నిర్మాణాన్ని పూర్తి చేయడం జరిగిందన్నారు. మిగిలిన వారందరూ త్వరితగతిన ఇళ్లను పూర్తి చేయాలని సూచించారు. ప్రభుత్వం ప్రతి ఇంటికి 1,80,000 రూపాయలు తోపాటు ,ఇసుక, సిమెంటు , ఇనుము తదితర సామాగ్రిని ప్రభుత్వం సరఫరా చేస్తుందన్నారు.

దగ్ధమవుతున్న పీచు

పరిశ్రమలో పీచు దగ్ధం

ప్రజాశక్తి -ఎస్.రాయవరం:మండలంలోని కొరుప్రోలు గ్రామంలో పీచుపరిశ్రమలో ఆరు బయట ఆర బెట్టిన పీచు దగ్ధమైంది. సోమవారం ఉదయం పద కొండు గంటల సమయంలో శ్రీ వేంకట పద్మావతి శ్రీ వేంకటేశ్వర క్వాయర్ ప్రొడక్ట్ ఇండస్ట్రీలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. విద్యుత్ తీగల నుండి పడిన అగ్గి రవ్వలే ప్రమాదానికి కారణమయ్యాయని కూలీలు తెలిపారు. నక్కపల్లి, యలమంచిలి అగ్నిమాపక శకటాలు మంటలను అదుపు చేసేందుకు ప్రయత్నించినా గాలి వేగంగా వీయడంతో మంటలను అదుపు చేయడం కష్టతరంగా మారింది. గ్రామస్థులు, కూలీలు తమ వంతు మంటలార్పేందుకు కృషి చేశారు. సుమారు పదిహేను నుండి ఇరవై లక్షల రూపాయల ఆరబెట్టిన పీచు అగ్ని ప్రమాదంలో దగ్ధమైనట్లు యజమాని బిక్కిన శ్రీను తెలిపారు. సుమారు నాలుగు గంటల సమయం పాటు శ్రమించి అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చారు.

సమాన భావాన్ని కలిగించేందుకు..

'సహిత క్లబ్'లు ఏర్పాటు

మేడివాడ హైస్కూల్ హెచ్ఎం జయలక్ష్మి

ప్రజాశక్తి రావికమతం :సకలాంగులకు వికలాంగులు తక్కువ కాదని, వారిలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఇతర పిల్లలతో సమానంగా అన్ని విషయాల్లో ముందుకు నడిపేందుకు 'సహిత క్లబ్'లను ఏర్పాటు చేయడం జరిగిందని మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఎం.జయలక్ష్మి తెలిపారు. మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలోని సహిత విద్యా విభాగం ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు ఆధ్వర్యంలో సోమవారం సహిత క్లబ్బులను ఏర్పాటు చేశారు. సాధారణ విద్యార్థులతో పాటు దివ్యాంగ విద్యార్థులను కలిపి వారికి క్రీడా పోటీలు రన్నింగ్, మ్యూజికల్ చైర్, పాటల పోటీలను నిర్వహించి గెలుపొందిన విజేతలకు బహుమతులును హెచ్ఎం జయలక్ష్మి, ఉపాధ్యాయులు అప్పలనాయుడు, గోవిందరావు, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు జగన్నాథం నాయుడు చేతుల మీదుగా అందజేశారు. స్కూల్ అసిస్టెంట్, ప్రత్యేక ఉపాధ్యాయులు మహాలక్ష్మి నాయుడు మాట్లాడుతూ, ఈ సహిత క్లబ్ లో స్కూలు హెడ్మాస్టరు, పీఈటీ, రెగ్యులర్ టీచర్, ఐఈఆర్టీ, ఇద్దరు సాధారణ విద్యార్థుల తల్లిదండ్రులు, ఇద్దరు దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు ఉంటారన్నారు. ఇతర పిల్లలతో కలిపి స్కూలు యాక్టివిటీస్‌లో పాల్గొనేలా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు దివ్యాంగ విద్యార్థులు సాధారణ విద్యార్థులు పాల్గొన్నారు.

బహుమతిని ఇస్తున్న ఇస్తున్న హెచ్ఎం, ప్రత్యేక ఉపాధ్యాయులు